
# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
18-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 146

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## టిడిపిలోకి తారకరత్న భార్య?!

పొలిటికల్ ఎంట్రీకి అలేఖ్య రెడ్డి సిద్ధం

చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇస్తే తెలంగాణలో పార్టీ బలోపేతానికి కృషి

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :నందమూరి కుటుంబానికి తెలుగు రాజకీయాలతో విడదీయరాని బంధం. నందమూరి

మిగతా 2లో

# గులాబీ పార్టీలో 'సర్' గుబులు!




**70 లక్షల కు పైగా ఓట్లు తొలగింపు జాబితాలో గ్రేటర్ లో 43 లక్షలకు పైగా**

**గతంలో నగర పరిధిలో 16 అసెంబ్లీ సీట్లలో బిఆర్ఎస్ గెలుపు**

**సెటిలర్స్ అండతోనే సాధ్యం**

**ఇప్పుడు వారి ఓట్లు తొలగింపుతో గులాబీ పార్టీలో భయం**

గులాబీ పార్టీ భయపడుతోందా? సమగ్ర ఓటర్ల సవరణ చేటు తెస్తుందని అంచనా వేస్తోందా? ముఖ్యంగా గ్రేటర్లో దెబ్బ తప్పదు అని భావిస్తోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఇటీవల సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తయిన సంగతి తెలిసిందే. తెలంగాణ వ్యాప్తంగా 70 లక్షలకు పైగా ఓట్లు తొలగింపు జాబితాలో ఉన్నాయి.

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** అందులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 43 లక్షలు ఉండడం భారత రాష్ట్ర సమితికి గుబులు పుట్టిస్తోంది. ఆ పార్టీ నానా హైరానా పడుతోంది.

- మిగతా 2వ పేజీలో

## నాగబాబు క్యాబినెట్ హోదా పదవి!

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా నియామకం

ప్రస్తుతం ఎమ్మెల్సీగా మెగా బ్రదర్

మంత్రి పదవి కోసం ఎదురుచూపు

ఇంతలోనే ఈ కొత్త పదవి



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** మెగా బ్రదర్, జనసేన ఎమ్మెల్సీ నాగబాబుకు మరో పదవి లభించింది. క్యాబినెట్ ర్యాంక్ తో కూడిన పదవిని ప్రకటించింది ఏపీ ప్రభుత్వం. రాష్ట్రంలో అడవుల విస్తీర్ణం, పచ్చదనాన్ని గణనీయంగా పెంచేందుకు ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్

మిగతా 2లో



## భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం రాక

ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు

## 'డీఎస్సీ 2025' చుట్టూ ఏపీ అసెంబ్లీ

సుదీర్ఘ వివరణ ఇచ్చిన మంత్రి నారా లోకేష్

చర్చకు సిద్ధం కావాలని జగన్‌కు సవాల్

మండలిలో మంత్రి అచ్చన్న వర్సెస్ బొత్స

పరస్పరం హాట్ కామెంట్స్

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. అసెంబ్లీకి వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. శాసనమండలికి మాత్రం వైసీపీ ఎమ్మెల్సీలు హాజరవుతున్నారు. అయితే తొలి రోజు అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్ గానే సాగాయి. శాసనమండలిలో అయితే వైయస్సార్

- మిగతా 3వ పేజీలో





ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి

విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది

ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేశాం

గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు

వచ్చే ఏడాదికల్లా ఉస్మానియా సహా అన్ని ఆస్పత్రులు ప్రారంభిస్తాం

కార్పోరేట్ స్థాయిలో ఆస్పత్రుల నిర్వహణ

సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

## విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

- మిగతా 3వ పేజీలో

## ఆలోచన..ఆచరణ కెసిఆర్‌ది


ప్రచారం..ఫలితం మాత్రం కాంగ్రెస్‌ది

సనత్‌నగర్ టిమ్స్‌పై హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఆలోచన, ఆచరణ కేసీఆర్‌ది అయితే.. ప్రచారం కాంగ్రెస్‌ది అన్నట్లుగా ఉందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు రేవంత్ రెడ్డి నియామక పత్రాలు ఇచ్చినట్టే.. కేసీఆర్ ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవాల పేరుతో కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. సనత్‌నగర్‌లోని



మిగతా 2లో



## ఆటో డ్రైవర్ ఇంట్లో డబ్బుల మూటలు

ఆయుధాల కోసం వెతికితే పట్టుబడ్డ నగదు

3కోట్లుగా స్వాధీనం చేసుకున్న పోలీసులు



## కాంగ్రెస్‌లో రెబల్స్!

ఏకతాటిపైకి అసమ్మతి ఎమ్మెల్యేలు

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి జై కొట్టిన అనిరుధ్ రెడ్డి

అధికార పార్టీలో పెరుగుతున్న ధిక్కార స్వరాలు

ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నం?!

తెలంగాణలో అధికార కాంగ్రెస్ లో అసంతృప్తి ఎమ్మెల్యేలు జతకడుతున్నారా? వారంతా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మద్దతు తెలుపుతున్నారా? పార్టీలో చీలికకు రాజగోపాల్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గత కొంతకాలంగా కాంగ్రెస్ నాయకత్వం పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఆయనకు తాజాగా మద్దతు తెలిపారు జడ్చర్ల ఎమ్మెల్యే జడేపల్లి అనిరుధ్ రెడ్డి. వారిద్దరు మాత్రమే కాదు అధికార కాంగ్రెస్ పార్టీలో సీఎం రేవంత్ రెడ్డి ని విభేదించే ఎమ్మెల్యేలంతా ఏకతాటిపైకి వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**మంత్రివర్గ విస్తరణ..:** రాష్ట్రంలో ఇప్పుడు మంత్రి పదవుల భర్తీ అంశం కాక రేపుతోంది. పదవులు ఆశిస్తున్న సీనియర్లు, యువ నేతలు ధిక్కారస్వరం వినిపిస్తున్నారు. అయితే వారికి అది తప్ప ప్రత్యామ్నాయం కనిపించడం లేదు.. ముఖ్యంగా మునుగోడు

మిగతా 2లో



## జీవన్ రెడ్డి బాటలో చిన్నారెడ్డి!

కాంగ్రెస్ పార్టీని వీడేందుకు నిర్ణయం

వనపర్తి నియోజకవర్గంలో

మారుతున్న రాజకీయం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** సీనియర్ నేత జీవన్ రెడ్డి బాటలో మరో సీనియర్ చిన్నారెడ్డి వెళ్ళనున్నారా? అధికార కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారా? గులాబీ పార్టీలో చేరుతారా? హస్తం పార్టీతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని తెంచుకుంటారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి.

- మిగతా 2వ పేజీలో

# కాంగ్రెస్‌లో రెబల్స్!

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఆ జాబితాలో ఇప్పుడు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కూడా చేరారు. జెన్ జీ కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన కోరుతూ వస్తున్నారు. మరోవైపు తాజాగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మద్దతు ప్రకటించారు. ఆయన వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలు సరైనవేనంటూ చెబుతున్నారు. దీంతో కాంగ్రెస్ హై కమాండ్ తో విభేదించే ఎమ్మెల్యేల సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా వర్గం బలపడుతోంది.

**అప్పట్లోనే పదిమంది ఎమ్మెల్యేలతో..**

గతంలో కాంగ్రెస్ పార్టీలో అనిరుధ్ రెడ్డి గట్టి ముసలానికి కారణం అయ్యారు. గతంలోనే తమ డిమాండ్ల సాధన కోసం పదిమందికి పైగా ఎమ్మెల్యేలను ఏకతాటిపైకి తెచ్చి సంతకాల సేకరణ జరిపారు. ఇప్పుడు అదే అనిరుధ్ రెడ్డి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మద్దతు తెలుపుతూ ఉండడం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతుంది. మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతున్న కొద్దీ ఈ అసమ్మతి మరింత ముదిరి.. సీఎం రేవంత్ రెడ్డి పట్టును సవాల్ చేసే స్థాయికి చేరుకునేలా కనిపిస్తోంది..

**బిజెపి భారీ ప్రకటనలు..**

మరోవైపు భారతీయ జనతా పార్టీ సైతం నిశితంగా గమనిస్తోంది కాంగ్రెస్ రాజకీయాలను. ఏ క్షణం అయినా కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుంది అంటూ నేతలు బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. సొంత ఎమ్మెల్యేల అసంతృప్తితో ఈ ప్రభుత్వం కోలడం ఖాయమని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసంతృప్తి వెనుక ప్రతిపక్షాల పాత్ర ఉందన్న అనుమానాలు పెరుగుతున్నాయి. క్రమేపి కాంగ్రెస్ లో అంతర్గత విభేదాలు పెరుగుతుండడంతో రేవంత్ రెడ్డి సర్కార్కు ఏదో సవాల్ గా మారింది. అయితే కాంగ్రెస్ హై కమాండ్ మాత్రం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని చూస్తున్నట్లు సమాచారం. అసమ్మతి



స్వరాలను ప్రారంభంలోనే అణచివేయకపోతే రేవంత్కు ఇబ్బందికర పరిస్థితులు తప్పవు. ప్రభుత్వ స్థిరత్వం పై ఈ రెబల్ విభాగాలు తీవ్ర ప్రభావం చూపే అవకాశాలే ఉన్నాయి. మరి రేవంత్ రెడ్డి ఎలా కట్టడి చేస్తారో చూడాలి.

# నాగబాబు క్యాబినెట్ హోదా పదవి!

(మొదటి పేజీ తరువాయి)

సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఈకోలాజికల్ ఎన్రిచ్మెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా నాగబాబును నియమించింది. ఈ మేరకు రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే జీవో జారీ చేశారు.

**రాజ్యసభ పదవి ఆశించినా..**

ప్రస్తుతం జనసేన ఎమ్మెల్సీగా ఉన్నారు నాగబాబు. మొన్నటి ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. జనసేన తరఫున ప్రచారం చేశారు. కూటమి సమన్వయానికి కృషి చేశారు. కూటమి అధికారంలోకి రాగానే నాగబాబుకు పదవి ఖాయమని ప్రచారం నడిచింది. రాజ్యసభకు వెళ్లడం ద్వారా కేంద్ర రాజకీయాల వైపు ఆసక్తి చూపారు నాగబాబు. అయితే రాజ్యసభ ఎంపిక సమయంలో ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. కానీ వివిధ సమీకరణల్లో ఆయనకు అవకాశం దక్కలేదు. అయితే ఎమ్మెల్సీ ని చేసి మంత్రివర్గంలోకి తీసుకుంటామని చంద్రబాబు అప్పట్లో ప్రకటించారు. ఏడాదిన్నర కిందట ఎమ్మెల్సీ అయ్యారు కానీ.. ఇంతవరకు మంత్రిగా అవకాశం దక్కలేదు నాగబాబుకు. అయితే ఇప్పుడు క్యాబినెట్ ర్యాంకింగ్ తో కూడిన పదవి ఇవ్వడం మాత్రం విశేషం.

**ఆ లక్ష్యంతోనే..**

అటవీ శాఖ మంత్రిగా ఉన్నారు పవన్ కళ్యాణ్. ఇప్పుడు అదే శాఖ పరిధిలోని ఈ నియామకం జరగడం.. నాగబాబును చైర్మన్గా నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రంలోని మొత్తం విస్తీర్ణంలో అడవులు, చెట్ల శాతాన్ని 247 నాటికి 50 శాతానికి పెంచాలని ప్రతిష్టాత్మక లక్ష్యంతో ఏపీ గ్రీన్ సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ లక్ష్యసాధనలో భాగంగా జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ గ్రీన్ డెవలప్మెంట్ ఏజెన్సీలు, రాష్ట్రస్థాయి కార్యకలాపాలను సమర్థవం తంగా సమన్వయం చేయడం, పర్యవేక్షించడం, నిర్వహించడంలో ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ అత్యంత కీలక పాత్ర పోషించనుంది. అటువంటి చైర్మన్ పోస్టులో నియమితులైన నాగేంద్రబాబుకు క్యాబినెట్ ర్యాంకింగ్ హోదా ఇచ్చారు. దీనికి సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు, అధికారాలు ఈ హోదాకు అనుగుణంగా వర్తిస్తాయని జీవోలో పేర్కొన్నారు.

# గులాబీ పార్టీలో 'సర్' గుబులు!

(మొదటి పేజీ తరువాయి)

**ఏకపక్ష విజయం..**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏకపక్షంగా విజయం సాధించింది గులాబీ పార్టీ. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో గణనీయమైన పట్టు పెంచుకుంది కాంగ్రెస్. కానీ గ్రేటర్ పరిధిలోకి వచ్చేసరికి కాంగ్రెస్కు షాక్ తగిలింది. ఒకే ఒక్క స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కానీ గులాబీ పార్టీ మాత్రం ఏకంగా 16 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన సీట్లలో సగం సీట్లు గ్రేటర్ పరిధిలో వచ్చినవే. అయితే అంతటి ఘన విజయాన్ని అందించిన గ్రేటర్లో ఏకంగా 43 లక్షల ఓట్లు తొలగింపు జాబితాలోకి వెళ్తుండడంతో భారత రాష్ట్ర సమితిలో ఆందోళన పెరుగుతోంది.

**సెటిలర్స్ కారణం..**

గ్రేటర్ హైదరాబాదులో భారత రాష్ట్ర సమితి పట్టు సాధించడానికి ప్రధాన కారణం సెటిలర్స్. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఏపీ సెటిలర్స్ ఎక్కువగా తెలంగాణ రాష్ట్ర సమితిని వ్యతిరేకించారు. ఆ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో



మెజారిటీ సీట్లు కోల్పోయింది ఆ పార్టీ. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికలకు వచ్చేసరికి భారత రాష్ట్ర సమితికి అండగా నిలిచారు సెటిలర్స్. దానికి కారణం లేకపోలేదు రెండు బెడ్రూమ్స్ ఇల్లు పథకం బాగానే వర్కౌట్ అయింది. అందుకే ఆ ఎన్నికల్లో నగరంలో 16 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది ఆ పార్టీ. అయితే ఇప్పుడు అదే సెటిలర్స్ ఓట్లు తొలగిపోనున్నాయి. తమ సొంత ప్రాంతాల్లో ఓట్లు కొనసాగించేందుకు వీలుగా గ్రేటర్ లో ఓట్లు వదులుకున్నారు సెటిలర్స్. ఇది అంతిమంగా పార్టీకి నష్టం చేకూరుస్తుందని గులాబీ పార్టీ నేతలు భయపడుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# టిడిపిలోకి తారకరత్న భార్య?!

తారక రామారావు తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేశారు. ఆ కుటుంబం నుంచి కుమారులు హరికృష్ణ, బాలకృష్ణ రాజకీయాల్లోకి వచ్చారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. మరోవైపు అల్లుడు నారా చంద్రబాబు టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా, ఉమ్మడి రాష్ట్రం తో పాటు నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తన పాత్ర పోషించారు. అదే కుటుంబం నుంచి దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు సైతం రాజకీయాలు చేస్తున్నారు. మరోవైపు నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని సైతం తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో నందమూరి ఫ్యామిలీ నుంచి మరో వారసురాలు రంగంలోకి రానున్నట్లు తెలుస్తోంది. దివంగత తారకరత్న భార్య అలేఖ్య రెడ్డి టిడిపిలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం.

**చాలా యాక్టివ్ గా తారకరత్న..**

నందమూరి తారకరత్న తెలుగుదేశం పార్టీలో చాలా యాక్టివ్ గా పని చేశారు. చంద్రబాబుతో పాటు లోకేష్ తో సన్నిహితంగా ఉండేవారు. నందమూరి బాలకృష్ణతో సైతం మంచి సంబంధాలు నడిపేవారు. అయితే సరిగ్గా ఎన్నికలకు ఏడాది ముందు.. 2023 ఫిబ్రవరిలో ఆయన హఠాన్మరణం చెందారు. నారా లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న తారకరత్న గుండెపోటుకు గురయ్యారు. చాలా రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. తారకరత్నకు భార్య అలేఖ్య రెడ్డి తో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వాస్తవానికి 2024 ఎన్నికల్లో ఏదైనా నియోజకవర్గ నుంచి పోటీ చేయాలని చూశారు తారకరత్న. ఇంతలోనే ఆయన కన్నుమూశారు.

**భర్త ఆశయ సాధన కోసం..**

నందమూరి తారకరత్న మృతి తర్వాత అలేఖ్య రెడ్డికి చంద్రబాబుతో పాటు నందమూరి బాలకృష్ణ అండగా నిలిచారు. ఆమె స్వయాన వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డి తోడల్లుడు కుమార్తె. అయితే ఇప్పుడు అలేఖ్య రెడ్డి పొలిటికల్ ఎంట్రీ వైపు ప్రచారం జోరుగా సాగుతోంది. మొన్న మధ్యన ఆమె తారకరత్న ఆశయ సాధన కోసం తాను రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించారు. అయితే ఇప్పుడు ఆమె అడుగులు తెలుగుదేశం పార్టీ వైపు ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించాలని భావిస్తున్నట్లు సమాచారం.. తారకరత్న వివాహానికి ముందు ఆమె మోడలింగ్ రంగంలో ఉండేవారు. అయితే పిల్లల కోసం మళ్లీ అదే మోడలింగ్ రంగంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇస్తే తెలుగుదేశం పార్టీలో చేరి తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఆమె సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం రాక

అమరావతి,ఆగస్ట్17 : భోగాపురం అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులు ప్రారంభం కావడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. చరిత్రాత్మక ఘట్టానికి భోగాపురం వేదికైందన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో నేటి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి తొలి ఇండిగో విమానం భోగాపురం విమానాశ్రయానికి చేరుకుందన్నారు. తొలి విమానం రాకతో ఏపీ.. కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఉత్తరాంధ్రకు మెరుగైన విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం.. రాష్ట్రం లో కొత్త అవకాశాలకు బాటలు వేస్తోందని సీఎం చెప్పుకొచ్చారు. యువత ఆశలు, ఆకాంక్షలకు ఈ విమానాశ్రయం రెక్కలు తొడుగుతుందని.. విద్య, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలకు మరింత ఊతమిస్తుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్టు కీలకంగా మారనుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చరిత్రాత్మక కొత్త ఆరంభమని.. ఉత్తరాంధ్రకు కొత్త గేట్‌వేగా అవతరించనుందని తెలిపారు.

# ఆలోచన..ఆచరణ కెసిఆర్‌ది



టిమ్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవంపై ఆయన స్పందించారు. డేట్లు, డెడ్‌లైన్లు మార్చుకుంటూ పోయి, చివరకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తున్న దవాఖానలో కూడా పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురాకపోవడం శోచనీయమన్నారు. వెయ్యి కోట్ల రూపాయలతో నిర్మించిన హాస్పిటల్‌ను కేవలం ఓపీ సేవలకే పరిమితం చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేరు మార్చినంత సులువుగా హాస్పిటల్ కట్టిన చరిత్ర మార్చలేవన్నారు. హైదరాబాద్‌కు మూడు వైపులా మూడు టిమ్స్ హాస్పిటల్స్ (అల్వాల్, సనత్‌నగర్, ఎల్బీనగర్) ఏర్పాటు చేసి, పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్నది కేసీఆర్ ఆలోచన. కరోనా తర్వాత భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, వందేళ్ల ముందు చూపుతో కేసీఆర్ "ఎఓ"లకు రూపకల్పన చేశారన్నారు. 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు మూడు ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ దవాకానలకు శంకుస్థాపన చేసి చరిత్ర సృష్టించారు. ప్రణాళిక కేసీఆర్‌ది.. శంకుస్థాపన కేసీఆర్‌ది.. నిధులు విడుదల చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఒక్కో ఆసుపత్రి వెయ్యి పడకల సామర్థ్యంతో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పేరుతో నిర్మించే మూడింటి నిర్మాణానికి రూ.2,679 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో శరవేగంగా సాగిన పనులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నత్తనడకన సాగాయి. సకాలంలో పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మూడున్నరేళ్ల సుదీర్ఘ కాలంలో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించకుండా, కేవలం ప్రచారం కోసం నేడు "ఎఓ" సనత్‌నగర్‌ను ప్రారంభిస్తున్నారు. కనీసం హాస్పిటల్‌కు నీటి సరఫరా కూడా కల్పించలేదు అంటే పేదల వైద్యం పట్ల వీరికి ఉన్న శ్రద్ధ ఏమిటో అర్థం అవుతుంది. కేసీఆర్ పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆలోచిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేదల నుంచి ఫీజులు వసూలు చేయాలని నిర్ణయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కండ్లు తెరవండి. కేసీఆర్ ఎంతో ముందుచూపుతో మొదలు పెట్టిన టిమ్స్, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పేదల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

# జీవన్ రెడ్డి బాటలో చిన్నారెడ్డి!

**బయటపడిన విభేదాలు..**

ఇటీవల వనపర్తి జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి ని లక్ష్యంగా చేసుకుని సంచలన ఆరోపణలు చేశారు. మేఘారెడ్డి డబ్బులు ఇచ్చి పార్టీ టికెట్ కొనుక్కున్నారని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిలిచిపోవడానికి, కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడడానికి ఎమ్మెల్యే వైఖరి కారణమని వ్యాఖ్యానించారు. అయితే ఒక్కసారిగా నియోజకవర్గ కాంగ్రెస్లో విభేదాలు బయటపడటం.. పార్టీ శ్రేణులు అడ్డగోలుగా చీలిపోయి ఆరోపణలు చేసుకోవడం సంచలనంగా మారింది.

**చివరి క్షణంలో మరొకరికి టికెట్..**

మొన్నటి ఎన్నికల్లో సీనియర్ నేతగా ఉన్న చిన్నారెడ్డిని తప్పించి చివరి క్షణంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ను మేఘా రెడ్డికి ఇచ్చారు. ఆ సమయంలో నిస్సహాయంగా ఉండి పోయారు చిన్నారెడ్డి. అయితే ఇప్పుడు తిరుగుబాటు హెచ్చరికలు జారీ చేస్తుండడం విశేషం. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తీవ్రంగా నష్టపోతున్నారని.. తన వర్గాన్ని అణచివేస్తున్నారని.. ఇలానే కొనసాగితే తాను కూడా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బాటలోనే అధిష్టానం పై తిరుగుబాటు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



**సీనియర్ మోస్ట్ లీడర్..**

చిన్నారెడ్డి సీనియర్ మోస్ట్ లీడర్. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం కొనసాగుతూ వచ్చారు. అటువంటి చిన్నారెడ్డి సామర్థ్యాన్ని తక్కువగా చూసి గత ఎన్నికల్లో మేఘా రెడ్డికి అవకాశం ఇచ్చింది కాంగ్రెస్ హై కమాండ్. అయితే ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత దూసుకుపోతున్నారు. ఆమె రాజకీయాలను తట్టుకోలేక పోతున్నారు చిన్నారెడ్డి. అయితే కొద్ది రోజుల కిందట కాంగ్రెస్ పార్టీలో ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొన్న జీవన్ రెడ్డి గులాబీ పార్టీలో చేరారు. అయితే ఇప్పుడు చిన్నారెడ్డికి రాజకీయంగా ఆ అవకాశం లేదు. ఎందుకంటే వనపర్తి నియోజకవర్గంలో కెసిఆర్ కు అత్యంత సన్నిహితుడైన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బలమైన నేతగా ఉన్నారు. ఒకవేళ చిన్నారెడ్డి గులాబీ పార్టీలో చేరినా పెద్ద ప్రయోజనం ఉండదు.

# ఆటో డ్రైవర్ ఇంట్లో డబ్బుల మూటలు

(మొదటి పేజీ తరువాయి)

ఓ ఆటో డ్రైవర్ ఇంట్లో రూ.3 కోట్లు లభ్యమైన ఘటన మధ్యప్రదేశ్‌లోని సాగర్‌లో చోటుచేసుకుంది. ఆటో డ్రైవర్ ఇంట్లో మారణాయుధాలు ఉన్నాయని సమాచారం రావడంతో పోలీసులు సోదా చేసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున నగదు సంచులు కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. దాదాపు ఐదు గంటల పాటు శ్రమించి నగదును లెక్కించారు. అనంతరం దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాగర్‌లోని గోపాల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్ రాజేశ్ అహిర్వార్ తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతని కుమారుడు సౌరభ్ అహిర్వార్ ఇటీవల సోషల్ మీడియాలో ఓ ఫొటోను షేర్ చేశాడు. తుపాకీతో దిగిన ఆ ఫొటో స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. అతని వద్ద మారణాయుధాలు ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగింది. దీంతో విషయం పోలీసులకు చేరింది. ఆటో డ్రైవర్ ఇంట్లో ఆయుధాలు ఉన్నాయన్న కారణంతో వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడి ఇంటికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఎంత వెతికినా ఆయుధాలు లభించలేదు. అయితే, పెద్దఎత్తున నగదు సంచులు బయటపడ్డాయి. ఆటో డ్రైవర్ ఇంట్లో ఇంత పెద్దమొత్తంలో నగదు కనిపించడంతో పోలీసులు షాక్ అయ్యారు. వెంటనే నగదు లెక్కించే యంత్రాలను తెప్పించారు. సుమారు ఐదు గంటల పాటు శ్రమించి దాని విలువ రూ.3 కోట్లుగా తేల్చి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ నగదు ఎక్కడి నుంచి వచ్చిందని ఆటో డ్రైవర్ కుటుంబాన్ని పోలీసులు ప్రశ్నించారు. అయితే, ఆ డబ్బుతో తమకు ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు. భోపాల్‌లో ప్రభుత్వ ఇంజనీర్‌గా పనిచేస్తున్న తమ బంధువు కుటుంబ సభ్యులదని వెల్లడించారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం





పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు.తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని, మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం అన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈరోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్ ను ప్రారంభించుకున్నాం సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటి వరకు రూ. 5226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ.21,800 కోట్లు వైద్య ఆరోగ్య శాఖ కోసం ఖర్చు చేశాం. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరితే,. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ప్రయత్నించలేదు. టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు. మేం అధికారంలోకి వచ్చాక సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం వివరించారు. ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి.2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్ ను నియమించి పర్యవేక్షిస్తాం. కార్పొరేట్ తరహాలో ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెంట్ లు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తాం.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా సమయాన్ని కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సహకాలను అందిచేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నానని అన్నారు. మేం టిమ్స్ ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లల్లా వచ్చి తిరిగి పోతున్నారు.కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్ కు వెళ్లి పేషంట్లకు టిమ్స్ లు కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగాడట.అక్కడ ఉన్న రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని.. రాను రాను వాడే తగ్గిపోతది అని చెప్పాడట.. మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ కుటుంబమే అధికారంలో వున్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు. మీరు ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు. కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా..ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోండి..నియోజకవర్గానికో పది, 20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయని అన్నారు. కెసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా.వాళ్లు అబద్దాలు చెప్పడం మాననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటానని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 16 ఏళ్ల వయసులో లక్ష్మణన్ సిఎ పూర్తి

న్యూఢిల్లీ: పదహారేళ్ల వయసులో టీనేజర్లు తాము ఏ రంగాన్ని ఎంచుకోవాలో తెలియక మల్లగుల్లాలు పడుతుంటారు. కానీ ఓ భారతీయ టీనేజర్ మాత్రం తనకు నచ్చిన రంగాన్ని ఎంచుకోవడమే కాకుండా అందులో గిన్నిస్ రికార్డు కూడా సృష్టించాడు. ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్న లక్ష్మణన్ మేయప్పన్ అత్యంత పిన్నవయస్కుడైన సీఏగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తాజాగా చోటు సంపాదించాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతడికీ అరుదైన గుర్తింపు లభించింది. ప్రస్తుతం మేయప్పన్ సెంచరీ ÷నాన్షియల్ అనే సంస్థలో సీనియర్ ÷నాన్షియల్ రీసెర్చ్ ఎనలిస్టుగా ఉన్నాడు. అతడి అసాధారణ ప్రజ్ఞ గురించి కంపెనీ స్వయంగా ప్రకటించింది. కొవిడ్ సమయంలో అకౌంటింగ్‌పై మేయప్పన్‌కు మక్కువ ఏర్పడింది. స్వయంగా సీఏ అయిన అతడి తల్లి అకౌంటింగ్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలను తనయుడికి పరిచయం చేయడంతో ఆసక్తి ఏర్పడింది.

# పథకాలను నీరుగార్చే కుట్ర

**సీఎం రేవంత్ రెడ్డికి ఆడపడుచులు తగిన బుద్ధి చెప్తారు**

**కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాల రద్దు కుట్రకు నిరసనగా బీఆర్ఎస్ ధర్నా**

**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి**



గండిపేట(క్రైమ్ మిర్రర్): కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాలను నీరుగార్చేందుకు కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న పథకాలను ఎలాంటి కోతలు,ఆంక్షలు లేకుండా యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.అనంతరం తహసీల్దార్‌కు బీఆర్ఎస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ...పేదింటి ఆడబిడ్డల వివాహ భారం తగ్గించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు తెలంగాణలో లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచాయని తెలిపారు.కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు గత పదేళ్లుగా విజయవంతంగా అమలవుతున్నప్పటికీ, ప్రస్తుతం వారి అనుకూలమైన వ్యక్తితో కోర్టులో కేసు వేయించి ఈ పథకాన్ని రద్దు చేయాలన్న కుట్రలు చేస్తుంది.కోర్టు కేసుల పేరుతో కాలయాపన చేయకుండా ఈ పథకాలను కొనసాగిస్తామని ప్రభుత్వం కోర్టులో స్పష్టమైన అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయడం లేదు..?అని శీలం తిరుపతిరెడ్డి ప్రశ్నించారు.కేసీఆర్ హయాంలో పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణ లక్ష్మీ--షాదీ ముబారక్ పథకాలను అమలు చేశారని తెలిపారు.పథకం ద్వారా వేలాది నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తులం బంగారం హామీని వెంటనే అమలు చేయాలని,కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాలకు నిధులు సకాలంలో విడుదల చేయాలని శీలం తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు.పేదల సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రజల తరఫున మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించిన కేసీఆర్ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డలకు మేనమామలా అండగా నిలిచిందని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి ఆర్థిక సాయంతోపాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని,అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిగా విస్మరించిందని ఆయన విమర్శించారు. కల్యాణలక్ష్మి చెక్కులు అందుకున్న ప్రతి అర్హురాలికి ఎన్నికల హామీ మేరకు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కల్యాణలక్ష్మి, తులం బంగారం వంటి హామీలను అమలు చేయాలని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలపై పోలీసులు కేసులు పెట్టారు అని శీలం తిరుపతిరెడ్డి అన్నారు. కోర్టులో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించి,పథకాల కొనసాగింపుపై అఫిడవిట్ దాఖలు చేయాలి. ఎన్నికల హామీ మేరకు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్,మైలార్ దేవులపల్లి,సులేమాన్ నగర్, హైదర్ గూడ,రాజేంద్రనగర్ డివిజన్ల అధ్యక్షులు ఎస్.వెంకటేష్,గుమ్మడి కుమార్,నరేందర్ రావు ,మమ్మద్ జహీరుద్దీన్,రఘు యాదవ్,ఎర్రోళ్ల యాదయ్య,నోముల రాము యాదవ్,సరిత, తదితరులు ఉన్నారు.

# 'డీఎస్సీ 2025' చుట్టూ ఏపీ అసెంబ్లీ

కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ ప్రభుత్వం పై చేసిన కామెంట్స్.. తరువాత మంత్రి కింజరాపు అచ్చం నాయుడు చేసిన ప్రకటనలు సెగలు పుట్టించాయి. ఆ ఇద్దరు నేతలు పరస్పరం దద్దమ్మ, ఎద్దు అంటూ సంబోధిస్తూ ఒక్కసారిగా చర్చను హీట్ పుట్టించారు. మండలితో పోల్చుకుంటే అసెంబ్లీలో మాత్రం ప్రశాంతమే.

**నాలుగోసారి లోకేష్ సవాల్..**

ప్రధానంగా డీఎస్సీ 2025 అంశం అసెంబ్లీని కుదిపేస్తోంది. డీఎస్సీ 2025లో అక్రమాలు జరిగాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు కూడా చేపడుతోంది ఆ పార్టీ. కానీ చాలా పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది. దానికి సంబంధించిన అన్ని అంశాలను ప్రజల ముందుంచి స్పష్టతనిచ్చే ప్రయత్నం చేసింది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గడం లేదు. అయితే ఇప్పుడు అసెంబ్లీ వేదికగా కూడా అదే అంశంపై చర్చ నడిచింది. శాసనసభలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. శాసనమండలిలో మాత్రం వైసీపీ ఎమ్మెల్సీలు డీఎస్సీ 2025 పై ఆరోపణలు చేశారు. శాసనసభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. డీఎస్సీ 2025ను చాలా పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు. కానీ గొడ్డలి పార్టీ దానిపై విషయం నింపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని మూడుసార్లు సవాల్ చేశానని.. చర్చకు రావాలని కోరానని.. ఇప్పుడు నాలుగోసారి సవాల్ చేస్తున్నానంటూ సభలో ప్రకటించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయుల భర్తీ చేపట్టిందని.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. తమ హయాంలో ఉత్తమ విద్య బోధనకు గాను ఉపాధ్యాయులను విదేశాలకు శిక్షణకు పంపించామని.. కానీ వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో వైన్ షాపుల ఎదుట ఉపాధ్యాయులను కాపలా పెట్టారని గుర్తు చేశారు. డీఎస్సీ అంటేనే ముందుగా తెలుగుదేశం పార్టీ గుర్తొస్తుందని.. మరో డీఎస్సీకి సిద్ధంగా ఉన్నట్లు కూడా లోకేష్ ప్రకటించారు. డీఎస్సీ 2025 పై ఎక్కడ అయినా చర్చించేందుకు సిద్ధం అని ప్రకటన చేశారు లోకేష్.

**దద్దమ్మ, ఎద్దు కామెంట్స్..**

మరోవైపు శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ హాట్ కామెంట్స్ చేశారు. 2025 డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. డబ్బులకు అమ్ముకున్నారని కూడా ఎద్దేవా చేశారు. దీనిపై మంత్రి అచ్చం నాయుడు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.



## కల్యాణలక్ష్మి పథకాన్ని నిర్వీర్యం చేయొద్దు

గండిపేట(క్రైమ్ మిర్రర్): పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసాగా నిలిచిన కల్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మణికొండ, నెక్నాంపూర్ బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువకులు, పార్టీ కార్యకర్తలు, స్థానికులు గండిపేట మండల కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక సహాయం అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం ఎంతోమంది కుటుంబాలకు అండగా నిలిచిందని వారు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు పథకాన్ని మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలను విరమించుకోవాలని కోరుతూ తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం ఇచ్చిన భరోసాను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్‌రావు, సుమనళిని, సుమన్, షకీలా రెడ్డి, రేఖ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



గండిపేట(క్రైమ్ మిర్రర్): హిట్ అండ్ రన్ ఘటనలు, వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని నార్సింగి ట్రాఫిక్ సీఐ ఆంజనేయులు, బండ్లగూడ జాగీర్ సర్కిల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. బండ్లగూడ జాగీర్ 123వ డివిజన్ పరిధిలో ఇటీవల వరుస రోడ్డు ప్రమాదాలు, హిట్ అండ్ రన్ ఘటనలు చోటుచేసుకుని పలువురు మృతి చెందడంపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, కన్వెక్స్ మిర్రర్లు ఏర్పాటు చేయడంతో పాటు స్కూల్ జోన్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బీజాపూర్ హైవేపై పాదచారుల భద్రత కోసం అవసరమైన ప్రాంతాల్లో జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపై స్పందించిన సీఐ ఆంజనేయులు సంబంధిత ట్రాఫిక్ ఆర్ఐకి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ శాఖ డిప్యూటీ కమిషనర్‌కు కూడా లేఖ పంపి అవసరమైన చర్యలు చేపట్టేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు హరీష్ గౌడ్, రాంప్రసాదరావు, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, మాజీ ఎంపీటీసీ భోగాల శ్రీనివాస్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా ప్రశాంత్ కిషోర్ ప్రమాణం

పాట్నా: జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్(పీకే) ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం బీహార్ శాసనసభలో స్పీకర్ ప్రేమ్ కుమార్ సమక్షంలో బంకిపూర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆగస్టు 3వ తేదీన బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో పీకే ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 1995 నుండి బీజేపీ కంచుకోటగా ఉన్న ఈ స్థానాన్ని దక్కించుకున్న పీకే.. బీజేపీకి గట్టి దెబ్బ కొట్టి చరిత్రాత్మక ఎన్నికల రంగ ప్రవేశం చేశారు. ఆ ఎన్నికల్లో మొత్తం 64,151 ఓట్లు సాధించిన పీకే.. బీజేపీకి చెందిన నీరజ్ కుమార్‌ను 19,324 ఓట్ల తేడాతో ఓడించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు వెళ్లడంతో.. బంకీపూర్ అసెంబ్లీ సీటు ఖాళీ అయ్యింది. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికలో పోటీ చేసిన పీకే.. ఎవరూ ఊహించని రీతిలో విజయం ఢంకా మోగించి.. బిహార్ అసెంబ్లీలో అడుగుపెట్టారు.


GHMC
hmda Growing Global
TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID: sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035

Mob : 9393929595

# తమిళ బడ్జెట్‌లో విజయ్ హామీలకు నిధులు



ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదు. అతుకుల బొంత. ఎప్పుడైనా కూలిపోవచ్చు. మధ్యంతర ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి. కార్యకర్తలు ధైర్యంగా ఉండండి. నమ్మకాన్ని కోల్పోవద్దు..ఇవి ఇటీవల డీఎంకే అధినేత స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు. అంతేకాదు విజయ్ గవర్నమెంట్ మీద.. గవర్నెన్స్ మీద ఆయన విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి కనీసం మూడు నెలలు కూడా పూర్తికాకముందే.. కొత్త ప్రభుత్వానికి ఆరు నెలలపాటు హనీమూన్ పీరియడ్ అనేది ఉంటుందని తెలిసి కూడా.. స్టాలిన్ విమర్శలు చేయడం మొదలుపెట్టారు. విజయ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించడం ప్రారంభించారు.ఎన్నికల సమయంలో నూతన వధువులకు 8 గ్రాముల బంగారం... పట్టు చీరలు.. ప్రభుత్వ వైద్యశాలలో జన్మించిన పిల్లలకు బంగారు ఉంగరాలు.. కాలేజీ విద్యార్థులకు లాప్టాప్ లు.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్.. వంటి హామీలను విజయ్ ప్రకటించారు. ఈ హామీలు అమలు చేయాలని.. నూతన వధువులకు బంగారం.. పట్టు చీరలు ఇచ్చే అవకాశం లేదని.. ప్రభుత్వం వీటిని నిలబెట్టుకోలేదని.. అనేక సందర్భాలలో స్టాలిన్ విమర్శించడం ప్రారంభించారు. ఈ విమర్శలకు టీవీకే నేతలు పెద్దగా స్పందించలేదు. విజయ్ కూడా రియాక్ట్ కాలేదు.టైం చూసి దెబ్బ కొట్టడం విజయ్ కి అలవాటు. సినిమాల్లో అయితే విలన్ ను ఎలా కొడతాడో.. రియల్ లైఫ్ లో కూడా తన ప్రత్యర్థిని కూడా అలాగే విజయ్ దెబ్బ కొట్టాడు. తమిళనాడు బడ్జెట్లో విజయ్ తన తిరుగులేని వ్యూహాత్మకత విధానాన్ని ప్రదర్శించాడు.. ప్రతిపక్షాలు అంచనా వేయలేని విధంగా తమిళ ప్రజల మీద వరాల జల్లు కురిపించాడు. నూతన వధువులకు 8 గ్రాముల బంగారం.. పట్టుచీర అందించడానికి 912 కోట్లు కేటాయించింది విజయ్ ప్రభుత్వం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టే పిల్లలకు బంగారు ఉంగరం ఇచ్చేందుకు 560 కోట్ల కేటాయించింది. కాలేజీలలో చదువుకునే విద్యార్థులకు ల్యాప్టాప్లు అందించడానికి 2000 కోట్లు కేటాయించింది. తొలిసారి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు రాయితీ 25వేల నుంచి 35వేలకు పెంచింది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పేదలకు అందిస్తామని ప్రకటించింది. దీనికి సంబంధించి కూడా నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించింది.ఈ హామీల మీద విజయ్ ప్రభుత్వాన్ని పదేపదే డిఎంకె ప్రశ్నిస్తోంది. వీటిని అమలు చేయాలని కోరుతూ ఉంది. దీనిపై విజయ్ ఇంతవరకు మాట్లాడలేదు. చివరికి బడ్జెట్లో తన కేటాయింపుల ద్వారా డీఎంకే చేస్తున్న ఆరోపణలకు సాలిడ్ సమాధానం ఇచ్చారు. అంతేకాదు తాను మాట ఇస్తే మడమతిప్పే అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. బడ్జెట్ కేటాయింపుల నేపథ్యంలో టీవీకే నేతలు సోషల్ మీడియాలో ఎదురు దాడి మొదలు పెట్టారు. డీఎంకే నేతలను లక్ష్యంగా చేసుకొని.. ఇప్పుడేమంటారని ప్రశ్నిస్తున్నారు.

# దేశమంటే మనుషులోయ్... నేటి రాజకీయాల్లో మారిన దేశభక్తి అర్థం!

**గురజాడ అప్పారావు గారు తన అమర గీతంలో దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని మహోన్నతంగా రాసినప్పుడు, ఆయన అమూల్యమైన మనసులో ఉన్నది ఒక అత్యంత సూటి నిత్యసత్యం. దేశం అంటే కేవలం భౌగోళిక భూభాగం కాదు, సరిహద్దులు కాదు, పటంలో గీసిన రేఖలు అంతకన్నా కానే కాదు. దేశం అంటే అందులో అనునిత్యం జీవించే సామాన్య మనుషులు, వారి కష్టసుఖాలు, వారి ఆత్మగౌరవం, వారి ఉజ్వల భవిష్యత్తు. ఈ ఒక్క దివ్య వాక్యం తెలుగు జాతి హృదయపు లోతుల్లో వందేళ్లుగా సజీవంగా ప్రతిధ్వనిస్తూనే ఉంది. కానీ ఈనాటి సమకాలీన రాజకీయాల్లో ఈ పవిత్రమైన మాటకు నిజంగా అదే అర్థం మిగిలి ఉందా అన్నది ప్రతి ఆలోచనాపరుడైన పౌరుడూ వేసుకోవాల్సిన మూల ప్రశ్న.**



గతంలో అసలైన దేశభక్తి అంటే ఏమిటి? స్వాతంత్ర్య పోరాట కాలంలో దేశభక్తి అంటే నిస్వార్థ ఆత్మత్యాగం. సొంత ఆస్తులు, ఉద్యోగాలు వదులుకోవడం, జైళ్లకు వెళ్లడం, ప్రాణాలు సైతం అర్పించడం. ఆనాటి మహానాయకులకు దేశం అంటే సామాన్య ప్రజలు తప్ప మరొకటి కానే కాదు. పేద రైతు కడుపు నింపడం, నేత కార్మికుడి చేతికి పని దొరకడం, పేదవాడికి నాణ్యమైన విద్య అందడం ఇవే అసలైన సార్థకమైన దేశసేవగా ఆ కాలంలో భావించేవారు. గురజాడ తన గీతంలో చెప్పినట్టు, పరుల కలిమికి పొంగిపోకుడు, పరుల విత్తులకు వాకిలి కాకుడు అనే స్ఫూర్తి ఆనాటి రాజకీయ నాయకత్వానికి స్పష్టమైన దిక్సూచిగా ఉండేది. దేశం కోసం పనిచేయడం అంటే ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయడం ఈ ప్రాథమిక సమీకరణం అప్పట్లో చాలా స్పష్టంగా నిలబడేది.

నేటి రాజకీయాల్లో మారిన అర్థం కానీ ఈనాటి రాజకీయ రంగంలోకి తొంగిచూస్తే, దేశభక్తి అనే పదం ఒక కొత్త రూపు సంతరించుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తుంది. అది ఇప్పుడు ప్రజాసేవకు నిదర్శనంగా కాక, ఒక ప్రభావవంతమైన రాజకీయ ఆయుధంగా వాడుకలోకి వచ్చింది. ఎన్నికల ప్రచారాల్లో దేశభక్తి నినాదాలు విపరీతంగా మారుమోగుతాయి, కానీ ఎన్నికలు ముగిశాక సామాన్యుడి దైనందిన బతుకు పోరాటం మాత్రం అక్కడే ఉండిపోతుంది. తీవ్రమైన నిరుద్యోగం, నింగినంటే నిత్యావసర ధరల పెరుగుదల, రైతుల ఆత్మహత్యలు, బతుకుదెరువు వలసలు ఈ కఠిన వాస్తవాల మధ్య దేశభక్తి నినాదాలు ఒక డొల్లుసరిగా మిగిలిపోతున్నాయా అన్న తీవ్రమైన సందేహం సామాన్య ప్రజల్లో రోజురోజుకూ బలపడుతోంది.రాజకీయ పక్షాలు తమ ప్రత్యర్థులను విమర్శించడానికి, నిలదీయడానికి దేశద్రోహి అనే ముద్ర వేయడం ఒక సాధారణ వ్యూహంగా మారింది. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలను ప్రశ్నించడం, అవినీతిని ఎండగట్టడం, ప్రాథమిక హక్కుల కోసం గొంతెత్తడం ఇలాంటి ప్రజాస్వామిక చర్యలను సైతం కొన్నిసార్లు దేశవ్యతిరేకతగా చిత్రీకరించే ప్రమాదకర ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. నిజానికి ప్రశ్నించడం అనేది ప్రజాస్వామ్యానికి ఊపిరి వంటిది. అదే లేకపోతే, ఏ ప్రభుత్వమైనా తన జవాబుదారీతనం పూర్తిగా కోల్పోతుంది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యాంశం ఏమిటంటే, ఈ ధోరణి ఏదో ఒక నిర్దిష్ట పార్టీకో, ఒక సిద్ధాంతానికో పరిమితం కాదు అధికారంలో ఉన్న ఏ పక్షమైనా, తన స్థానాన్ని నిలబెట్టుకోవడానికి ఈ మార్గాన్ని ఆశ్రయించడం మనం స్పష్టంగా గమనించవచ్చు.జెండాలు, నినాదాల వెనుక ఉన్న వాస్తవం జాతీయ జెండాను భుజాన వేసుకోవడం, వేదికలపై వందేమాతరం అని నినాదాలు ఇవ్వడం అత్యంత సులభమైన పని. కానీ ఆ జెండా నీడన జీవిస్తున్న కోట్లాది మంది పేదల కడుపు నింపడం నిజంగా కష్టమైన పని. ఈ రెండింటి మధ్య అంతరం రోజురోజుకూ పెరిగిపోతోందని అనేకమంది సామాజిక విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు అభివృద్ధి గణాంకాలు, జీడీపీ లెక్కలు గొప్పగా ప్రకటిస్తుంటే, మరోవైపు గ్రామాల్లో తాగునీళ్ల కోసం, ఆసుపత్రుల కోసం, పాఠశాలల్లో కనీస వసతుల కోసం ప్రజలు ఇంకా నిరంతరం పోరాడుతూనే ఉన్నారు. ఈ వైరుధ్యాన్ని చూసినప్పుడు, దేశభక్తి అనేది కేవలం ఆకర్షణీయమైన రాజకీయ ఉపన్యాసాలకే పరిమితమైందా అనిపించక మానదు.

అయితే ఇదంతా ఒకే కోణంలో చూసి నిరాశపడాల్సిన అవసరం ఎంతమాత్రమూ లేదు. రాజకీయాల్లో దేశభక్తిని స్వార్థానికి ఆయుధంగా వాడే ధోరణి పెరిగినప్పటికీ, నిజాయితీగా నిశ్శబ్దంగా ప్రజాసేవ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు ఇప్పటికీ మన భారతీయ సమాజంలో నిరంతరం ఉన్నారు. మారుమూల ప్రాంతాల్లో అంకితభావంతో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు, సరిహద్దు సైనికులు, వైద్యులు, ఉపాధ్యాయులు వీరంతా ఆర్భాటపు ప్రచారానికి దూరంగా ఉండి నిజమైన దేశసేవ చేస్తున్న అమూల్యమైన రత్నాలు. దేశభక్తి అనే విశాల భావనను కేవలం రాజకీయ నాయకుల మాటలతో మాత్రమే కొలవలేము.ప్రజలే అసలైన న్యాయమూర్తులు చివరకు, ఈ ధర్మసందేహానికి సరైన సమాధానం చెప్పాల్సింది ప్రజాస్వామ్యంలో ప్రజలే. ఏ నినాదం వెనుక ఎంత చిత్తశుద్ధి ఉందో, ఏ వాగ్దానం వెనుక ఎంత చేయగలిగే శక్తి ఉందో సరిగ్గా బేరీజు వేసుకోవాల్సిన గురుతర బాధ్యత ఓటర్లదే. దేశభక్తి అంటే జెండా ఊపడం మాత్రమే కాదు, పన్నులు నిజాయితీగా చెల్లించడం, చట్టాన్ని గౌరవించడం, తోటి పౌరుడి పట్ల సహనం చూపడం, సమాజం కోసం చిన్న చిన్న బాధ్యతలు నిర్వర్తించడం కూడా పరిపూర్ణమైన నిజమైన దేశభక్తే అవుతుంది. గురజాడ చెప్పినట్టు ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్ ప్రజలు కష్టాల్లో ఉన్నంత కాలం ఏ దేశమూ నిజంగా అభివృద్ధి చెందదు.నేటి రాజకీయాల్లో దేశభక్తి పదం అర్థం పూర్తిగా మారిపోయిందని చెప్పలేము, కానీ దాని వాడకంలో మాత్రం గణనీయమైన స్వార్థపూరిత మార్పు వచ్చిందని కాదనలేము. ఈ మార్పును పౌరులు స్పష్టంగా గుర్తించి, అసలైన దేశభక్తి అంటే ఏమిటో మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకోవడం, రాబోయే తరాలకు ఆ స్వచ్ఛమైన స్ఫూర్తిని అందించడం నేటి ఆధునిక సమాజం ముందున్న ఒక అత్యంత గొప్ప సవాలు. దేశమంటే మట్టి కాదు, మనుషులే అనే నిత్యసత్యాన్ని రాజకీయాలు మరిచిపోకుండా చైతన్యవంతంగా చూసుకోవాల్సిన బాధ్యత కేవలం పాలకులదే కాదు, సమాజంలోని ప్రతి ఆలోచనాపరుడైన పౌరుడిదీను. ఈ నిత్య సత్యాన్ని నిలబెట్టుకున్నప్పుడే మన ప్రజాస్వామ్య వ్యవస్థ వర్ధిల్లుతుంది. నవభారత నిర్మాణానికి నిసర్గమైన మానవీయ విలువల కంటే మిన్నయైనది మరొకటి లేదు.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# హుందాతనం కోల్పోతున్న రాహుల్!

**రాజకీయాల్లో హుందాతనం అవసరం. సమయానుకూలంగా మంచిగా మాట్లాడేలా వ్యవహరించాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. అందులోనూ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తికి ఇవన్నీ అవసరం. ప్రతిపక్ష నేతగా సమర్థత ఉంటేనే రాణిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైనా చెల్లుతుంది. కానీ ప్రతిపక్షనేతగా రాణించాలంటే ప్రజల్లో తన వ్యక్తిత్వం కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. మాటలు, చేతలు అన్నీ హుందాగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ ఈ మధ్య మరీ దిగజారి పోయారు. మాటల్లో హుందాతనం లేదు.**



చేతల్లో అంతకన్నా లేకుండా పోయింది. సర్కస్‌లో జోకర్‌లా, డ్రామాల్లో విదూషకుడిలా ఆయన ప్రవర్తిస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. లోక్‌సభలో మాట్లాడాల్సిన సమయంలో మాట్లాడరు. మాట్లాడితే పస ఉండడం లేదు. సమస్యలపై అవగాహన ఉండడం లేదు. విషయంపై పట్టు ఉండడం లేదు. ఇవన్నీ కలగలిపి రాహుల్ గాంధీ విపక్ష నేతగా పూర్తిగా విఫలం అవుతూ వస్తున్నారు. ఇటీవల వరుసగా పార్లమెంట్ సమావేశాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం కూడా రాహుల్ అన్న విషయం మరచిపోరాదు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన ఎంతగా దిగజారిపోయారో అనడానికి నిదర్శనంగా నిలిచాయి. ఆలింగనాలే ప్రధాన మంత్రి మోదీ విదేశీ దౌత్యం అంటూ... లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు..ఆయన ఆహార్యం సామాన్యులకు కూడా వెగటు పుట్టించేలా ఉన్నాయి. అహంకారం హద్దులు దాటి రాహుల్ నోరుజారుతున్నారనడానికి ఇంతకన్నా నిదర్శం అక్కర్లేదు. ఇది ఓ రకంగా భారత ప్రతిష్ఠను దిగజార్చేలా ఉంది. ఇలాంటి ప్రతిపక్ష నేతను గతంలో ఎప్పుడూ చూడలేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజం. ఎందుకంటే భారత దౌత్యంపై రాహుల్ చేసినవి దిగజారుడు వ్యాఖ్యలు చూశాక ఇలాంటి ప్రతిపక్ష నేత ఉన్నందుకు దేశ ప్రజలు సిగ్గుపడాలి. ఆయన ప్రవర్తన ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. రాహుల్ వ్యాఖ్యలు విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఎందుకంటే రాహుల్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు వ్యవహరించిన తీరు పిచ్చిగా మారుతోందనడానికి చెప్పడానికి సిగ్గుపడాల్సిన పనిలేదు. భావి భారత ప్రధాని అని కాంగ్రెస్ శ్రేణులంతా పొగడుతున్న వేళ..ఆయన భాషను, ఆహార్యాన్ని చూస్తుంటే..ఇతనూ ఒక నేతేనా అన్న సందేహం కలుగక మానదు. ఇలాంటి వారిచేతిలో భారత్ పదిలంగా ఉండగలదా అన్న భయం కలుగుతోంది. భారతదేశాన్ని నడపడానికి సుదీర్ఘ అనుభవం కావాలి. పనికిమాలిన నాటకాలు కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని జోకర్లని పిలవడం, మోడీని, అమిత్ షాలను కట్టగట్టి తిట్టడం పరిధికి మించిన విషయం. రాహుల్ వాడుతోన్న భాష మూర్ఖత్వాన్ని, నిరాశను తెలిజేస్తున్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. అలాగే విదేశాల్లో వివిధ నేతలతో మోడీ ఆలింగనాలపైనా కువ్యాఖ్యలు చేశారు. నిజానికి ఓ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తి విదేశీ నాయకులపై రాజకీయ వ్యాఖ్యలు చేసేటప్పుడు గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సి ఉంటుంది. తానొక విపక్షనేతను అన్నది మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పారాకాష్టగా చూడాలి. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తరవాత ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో కొంత విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా మారడానికి తపించారు. అయితే సార్వత్రక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ వ్యవస్థగా మార్చేయడంతో భారత్ జోడో యాత్ర నాటి ఆదర్శం లేకుండా పోయింది. ఇప్పుడు జన్‌జి అంటూ మాట్లాడుతున్న రాహుల్ వారికి పార్టీలో అవకాశం ఇవ్వలేక పోయారు. ప్రియాంకగాంధీని

వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నిక చేయించుకున్నారు. తల్లి సోనియాను రాజ్యసభకు పంపారు. తాను రాయబరేలి నుంచి ఎన్నికయ్యారు. ఇది కుటుంబ పార్టీ అనకుండా ఎలా ఉండగలం. వృద్ధనేతలంతా కాంగ్రెస్‌లో పాతుకు పోయారు. యువ నేతలను దరిచేరనీయకుండా చూసుకుంటున్నారు. వీరు జన్‌జీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక చెప్పుకోవడం సిగ్గుచేటు. 2024 సార్వత్రక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను కాబోయే ప్రధానమంత్రి అని కీర్తించడం ప్రారంభించారు. కొందరు మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనకు వంతపాడుతూ వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత ఇప్పుడు వెనుతిరిగి చూస్తే అంత సీన్ రాహుల్‌కు లేదని అనిపిస్తోంది. తాజాగా రాహుల్ చేష్టలు, వ్యాఖ్యలు ఆయనలో నాయకత్వ పటిమ లేదని నిరూపించాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేక పోతున్నారు. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీతో పోలిస్తే .. రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు ఎక్కడా కనిపించవు. సమయానుకూలంగా ఏదో ఓ సమస్యపై మాట్లాడడం, విదేశాలకు చెక్కేయడం అలవాటు చేసుకున్నారు. అక్కడా భారత పరువు పోయేలా మాట్లాడడం కూడా అలవాటు చేసుకున్నారు. 'ఓటు చోరీ'పై ఇలాగే చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రధాని కన్నా ఎక్కువ కష్టపడాలి. ఎక్కువగా కృషి చేయాలి. యూపీఏ అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో రాహుల్ మంత్రిపదవిని చేపట్టేందుకు అంగీకరించలేదు. దీంతో ఆయనకు అధికారంలో ఉండడం ఎలా అన్నది కూడా తెలియదు. ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు మాత్రం ఎలా నమ్ముతారు. గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని రాహుల్, ఇప్పటికీ పదేపదే అవే తప్పులు చేయడంతో పాటు, రాజకీయ హుందాను కోల్పోతున్నారు. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధాన మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా మరింతగా దిగజారిన నేతగా ప్రజల్లో చులకన భావం మూటకట్టుకుంటున్నారు. ఇలాంటి వ్యక్తి నిజసానికి ప్రతిపక్ష నేతగా కూడా పనికిరాడు. ఇక ప్రధానిగా కావాలనుకంటున్న ఇతనికి వందిమాగధులు చేస్తున్న పొగడ్తలతో ఉబ్బిపోవడం తప్ప మరోటి తెలియడం లేదు. స్వయం ప్రకటితంగా ఇక తానే భావి ప్రధాని అనుకోవడంతో వచ్చిన మానసిక వైకల్యంగా చూడాలి. వీటిని అధిగమించితే తప్ప సమర్థనేతగా రాహుల్ రాణించడం కష్టం.

# కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి

## మందమర్రిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా





మందమర్రి, ఆగస్టు 17 (క్రైమ్ మిర్రర్) : కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మందమర్రి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, చెన్నూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ చెన్నూరు నియోజకవర్గ నాయకుడు డాక్టర్ రాజారమేష్, క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల మనసుల్లో నుంచి తొలగించలేరన్నారు. కళ్యాణ లక్ష్మీ కింద అందుతున్న రూ. 1,00,116 ఆర్థిక సాయాన్ని కొనసాగించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాల్సిన ప్రభుత్వం ఇప్పటికే అమలులో ఉన్న పథకాలను నిలిపివేయడం సరికాదన్నారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు తదితర వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ప్రజా సంక్షేమానికి విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే భవిష్యత్తులో మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూమన్న గౌడ్, బబ్బెర స్వర్ణలత, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుదర్శన్ గౌడ్, రామిడి కుమార్, అనిల్‌రావు, ఆర్నె సతీష్, వేముల వెంకటేశం, పట్టణ నాయకులు అబ్బాస్, తిరుపతిరెడ్డి, సూరిబాబు, మేడిపల్లి మల్లేష్, తోట సురేందర్, కనకయ్య, బర్ల సదానందం, టిబీజీకేఎస్ నాయకులు రాజశేఖర్, గణేష్‌రెడ్డితో పాటు వార్డు అధ్యక్షులు, యువజన, విద్యార్థి, సామాజిక మాధ్యమ విభాగాల నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జైపూర్ మండల కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా సుర సంజయ్



జైపూర్, ఆగస్టు 17 క్రైమ్ మిర్రర్): జైపూర్ మండల కాంగ్రెస్ కమిటీ నూతన కార్యదర్శిగా సుర సంజయ్‌ను నియమించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్ల విశ్వంభర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా చెన్నూర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఇలియాజుద్దీన్ ఆధ్వర్యంలో సుర సంజయ్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుర సంజయ్ నియామకంతో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, పార్టీ కార్యకలాపాలకు కొత్త ఉత్సాహం వస్తుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ మరింత సమర్థంగా పనిచేసేలా ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎలకంటి సర్పంచ్ గుడెల్లి శ్రీనివాసరెడ్డి, రామారావుపేట సర్పంచ్ పులి రాజశేఖర్, వేలాల సర్పంచ్ డేగ స్వప్న--నగేష్, వార్డు సభ్యుడు చీర్ల శిశిందర్ యాదవ్, మండల జనరల్ సెక్రటరీ వేముల రవి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కాసిపేట సతీష్‌కుమార్, రామారావుపేట కుల పెద్దమనిషి కుర్మా కాసు బీరయ్య, గ్రామ నాయకులు బొద్దున రాజు, అమరకొండ శివయ్యతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజీ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

## ద్వారకుంట వద్ద భారత్ పెట్రోలియం ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

**ప్రారంభించిన ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి.**



కోదాడ, ఆగస్టు 17 (క్రైమ్ మిర్రర్): ద్వారకుంట సమీపంలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ది తెలంగాణ ఎగ్జిట్ ఫిల్లింగ్ స్టేషన్ ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు, ప్రయాణికులకు ఈ ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా నాణ్యమైన ఇంధనం, సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీపీసీఎల్ స్టేట్ హెడ్ టోనేష్ కె చతుర్వేది, టెరిటోరియల్ మేనేజర్ సుధీర్ కనల, సేల్స్ ఆఫీసర్ గుడిసె తేజ్‌దీప్ రెడ్డి, ఇంజనీరింగ్ ఆఫీసర్ ఆదిత్య యాదవ్, డీలర్ లాం రాజీవ్, మున్సిపల్ చైర్మన్ ఎర్నెని కుసుమ,వెంకటరత్నం బాబు, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు, డాక్టర్ రామారావు, సర్పంచ్ పాలకి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిలిపివేతపై శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఆగ్రహం....




శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ : కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు శేరిలింగంపల్లిలో భారీ ర్యాలీ చేపట్టాయి. పీజేఆర్ స్టేడియం నుంచి చీఎ-65 వరకు జరిగిన ఈ ర్యాలీకి మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి నేతృత్వం వహించారు. కేటీఆర్ పిలుపు మేరకు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కృష్ణారావు దిశానిర్దేశంలో జరిగిన నిరసనలో మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. “తులం బంగారం పేరుతో మోసం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలి” అంటూ రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పథకాలను కొనసాగించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగా రావు, మిద్దెల మల్లారెడ్డి, పారినంది శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## హఫీజ్‌పేట్‌లో పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని బీజేపీ డిమాండ్....




మియాపూర్ క్రైమ్ మిర్రర్: హఫీజ్‌పేట్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కైతాపురం జితేందర్‌లి డిమాండ్ చేశారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మియాపూర్ సర్కిల్-48 డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. మదీనాగూడ ప్రధాన రోడ్డు, హుడా కాలనీ, సాయి నగర్ అంగన్వాడీ రోడ్డు, హిందూ స్మశానవాటికకు వెళ్లే సీసీ రోడ్లు, కుమ్మర బస్తీ పెండింగ్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలని కోరారు. అలాగే హుడా కాలనీ రైతు బజార్‌ను ప్రజలకు అందుబాటులోకి తెవాలని, ఖైదమ్మకుంట వద్ద రోజువారీ చెత్త సేకరణ, చెరువులోకి వర్షపు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. అజిత్ కుమార్ సేనాపతి, డివిజన్ ప్రధాన కార్యదర్శి మారెళ్ల వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షుడు ప్రసాద్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.



## గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం

### మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్-

కోదాడ, ఆగస్టు 17 (క్రైమ్ మిర్రర్): పేద ప్రజలకు అండగా నిలిచే కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసివేయాలని చూస్తుంది కోదాడ పట్టణంలోని బస్టాండ్ సెంటర్ గాంధీ విగ్రహం వద్ద కేటీఆర్ గారి పిలుపుమేరకు నిరసన చేపట్టి గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చిన మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్, స్థానిక మహిళలు, బి ఆర్ ఎస్ నాయకులు. ఈ కార్యక్రమంలో మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కెసిఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడబిడ్డలకు ఆసరాగా నిలిచే పథకం అలాంటి పథకాన్ని కెసిఆర్ ప్రవేశపెట్టారని దురుద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని తీసివేయాలని చూస్తుంది. కళ్యాణ లక్ష్మి పథకం తీసివేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతాము .గత ఎలక్షన్ సమయంలో మేనిఫెస్టోలో కళ్యాణ లక్ష్మి పథకం లక్ష రూపాయలు తో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు అది అమలు చేసిన దాఖలాలు లేవు ఈరోజు ఉన్న పథకాన్ని కూడా ఎత్తివేయాలని చూస్తున్నారు, కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ పథకాన్ని తీసివేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామన్నారు.

## ఆర్.ఎం.పి, పి.ఎం.పి అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

### ఆర్ఎంపీలు అనుభవం ఉన్నా.. పరిధి దాటొద్దు-

### జిల్లా ఆర్ఎంపీల సంఘం అధ్యక్షుడు దొంతగాని రవిబాబు-




కోదాడ, ఆగస్టు 17 (క్రైమ్ మిర్రర్): ఆర్ఎంపీలు తమ పరిధికి మించి వైద్యం చేయకుండా నిబంధనలు పాటించాలని జిల్లా ఆర్ఎంపీల సంఘం అధ్యక్షుడు దొంతగాని రవిబాబు సూచించారు. కోదాడ పట్టణంలో నిర్వహించిన ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యవసర, అబార్షన్ కేసులను స్వయంగా చికిత్స చేయకుండా సంబంధిత విభాగాల నిపుణులైన వైద్యుల వద్దకు పంపించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలను ప్రోత్సహించవద్దని, పరిధికి మించి వైద్యం చేసి ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని అన్నారు. కొత్తగా ఆర్ఎంపీలుగా వస్తున్న వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు భూతం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటప్పయ్య, అంజిరెడ్డి, సిద్ధారెడ్డి, ఉపేందర్, శ్రీశైలం, ఖాజా, శౌరీ, నాగరాజు, లింగయ్య, శ్రీకాంత్, నాని తదితరులు పాల్గొన్నారు.

## సర్కిల్-48లో ఫారం-5 ముసాయిదా ప్రచురణ పూర్తి......




మియాపూర్ క్రైమ్ మిర్రర్ : సిఎంసీ పరిధిలోని మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పీజెడ్‌లో ఫార-5 ముసాయిదా ప్రచురణ ప్రక్రియ పూర్తయిందని ఉప కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు . వారు మాట్లాడుతూ... ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రచురించిన వివరాలపై అభ్యంతరాలు, వాదనలు ఉంటే నిర్దేశిత గడువులోగా సంబంధిత అధికారులకు సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. ఓటర్లు తమ వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకుని, ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే అవసరమైన ఆధార పత్రాలతో పాటు నిర్ణీత సమయంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఓటరు జాబితాలో తమ వివరాలు సక్రమంగా నమోదయ్యేలా చూసుకోవాలని అధికారులు కోరారు.

# షామీర్‌పేట్‌లో భారీగా పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు

### వెయ్యి బస్తాల పీడీఎస్ బియ్యం గుర్తింపు

### 500 ఖాళీ గన్నీ బ్యాగులు, రెండు వాహనాలు స్వాధీనం

### స్టేషన్ బెయిల్ తో సమాప్తం.. కఠిన చట్టాలు లేకనే ఈ దందాలు!?




**షామీర్‌పేట(క్రైమ్ మిర్రర్):** మేడ్చల్ జిల్లా షామీర్‌పేట్ మండలంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన గోదాముపై, సివిల్ సప్లయిస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి నిర్వహించారు. సివిల్ సప్లయిస్ చీఫ్ విజిలెన్స్ అధికారి సి. శశిధర్‌రాజు పర్యవేక్షణలో, టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఇన్స్పెక్టర్ అజయ్ బాబు, సబ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, ప్రభాకర్, ఏపిఓ రమణ ఈ తనిఖీలు చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల నుంచి షామీర్‌పేట్ మండలంలోని, పలు ప్రాంతాల్లో అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో లాల్‌గడి--మలక్‌పేట్ పరిధిలోని ఏడీ మాన్యుఫ్యాక్చరర్స్‌కు చెందిన, సర్వే నంబర్ 817/ఏలో ఉన్న గోదాములో, భారీ మొత్తంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యం నిల్వ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గోదామును పూర్తిగా పరిశీలించిన అధికారులు సుమారు వెయ్యి బస్తాల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. దీనితో పాటు 500 ఖాళీ గన్నీ బ్యాగులను కూడా గుర్తించారు. బియ్యం అక్రమంగా నిల్వ చేయడంతో పాటు, ఖాళీ గన్నీ బ్యాగులు పెద్ద సంఖ్యలో ఉండటంపై అధికారులు దృష్టి సారించారు. తనిఖీల్లో భాగంగా టీఎస్30--టీఏ--0687 నంబర్ గల అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం, టీఎస్28--టీ--4643 నంబర్ గల జీటో వాహనం కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి వినియోగంపై కూడా అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. దాడి అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించి పోలీసులను సంఘటనా స్థలానికి రప్పించారు.ప్రభుత్వం పేదలకు సబ్సిడీపై అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, తరలించడం, ఇతర మార్గాల్లో విక్రయించడం వంటి చర్యలపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా షామీర్‌పేట్‌లో వెలుగుచూసిన భారీ నిల్వలు పీడీఎస్ బియ్యం అక్రమ దందాపై అధికారుల నిఘా మరింత పెంచాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ వ్యవహారంలో గోదాం యజమాన్యం, బియ్యం నిల్వకు సంబంధించిన వ్యక్తులు, వాహనాల వినియోగం తదితర అంశాలపై అధికారులు మరింత లోతుగా విచారణ చేపట్టే అవకాశం ఉంది. పీడీఎస్ బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరి ద్వారా గోదాముకు చేరింది? ఎక్కడికి తరలించేందుకు సిద్ధం చేశారు? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇంత కష్టపడి పట్టుకున్న వారిని, స్థానిక పోలీసులు స్టేషన్ బెయిల్ ఇవ్వడం, ఈ అక్రమ దందాకు ఆయువు పట్టుగా మారింది. సీజ్ చేసిన వాహనాలు వెంటనే బయటకు రావటం, ఈ తనిఖీలపై నమ్మకాలు కోల్పోతున్నారు ప్రజలు.. కఠినమైన చట్టాలు వస్తేనే ఈ దందాలకు అడ్డుకట్ట పడుతుందని అనుభవజ్ఞులు అంటున్నారు.



## శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ......

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ పూర్తయింది.ఈ జాబితాను ప్రజల పరిశీలన కోసం ఈఆర్వో కార్యాలయం, సర్కిల్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, ఐఏఎస్ తెలిపారు.అర్హత తేదీ: 01.10.2026 క్లెయిమ్‌లు, అభ్యంతరాల చివరి తేదీ:లి 16.09.2026 కొత్త ఓటరు నమోదుకు ఫారం-6, పేరు తొలగింపునకు ఫారం-7, వివరాల మార్పులకు ఫారం-8ను సంబంధిత కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## కల్వకుర్తి పట్టణ ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమం అనంతరం కల్వకుర్తి పట్టణ ఓటర్ల జాబితా ముసాయిదాను పుర కమిషనర్ మహమూద్ షేక్ సోమవారం విడుదల చేశారు. కల్వకుర్తి పట్టణంలో గతంలో మొత్తం 25,580 మంది ఓటర్లు ఉండగా, ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా మరణించిన, ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ అయిన, డబుల్ ఓట్లు తదితర వివరాలను గుర్తించి పరిశీలించిన అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాను రూపొందించారు. తాజా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రకారం పట్టణంలోని 27 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 19,892 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజల పరిశీలన కోసం కల్వకుర్తి పురపాలక సంఘ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ తెలిపారు. పట్టణ ప్రజలు తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు, మార్పులు అవసరమైతే లేదా అర్హత ఉన్నప్పటికీ తమ పేరు ఓటర్ల జాబితాలో లేకపోతే పురపాలక సంఘ కార్యాలయాన్ని సంప్రదించాలని కమిషనర్ మహమూద్ షేక్ కోరారు. ప్రజలు ముసాయిదా జాబితాను పరిశీలించి అవసరమైన సవరణలు, అభ్యంతరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## సైబరాబాద్ లో "నో పోస్టర్స్" డ్రైవ్...

### పరిశుభ్ర నగరమే లక్ష్యం....

### సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన...




సైబరాబాద్ క్రైమ్ మిర్రర్ : నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా, క్రమబద్ధంగా తీర్చిదిద్దేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నో పోస్టర్స్ ఇన్ పబ్లిక్ స్పేసెస్ కార్యక్రమాన్ని వేగవంతం చేసింది.ప్రధాన రహదారులు, జంక్షన్లు, కూడళ్లు, ప్రజా ప్రదేశాల్లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసే పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీల వల్ల దృశ్య కాలుష్యం పెరుగుతోందని సీఎంసీ అధికారులు గుర్తించారు. దీంతో వాటిని తొలగించి, నగర సుందరీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.అనధికారిక ప్రకటనలు రోడ్లపై వాహనదారులకు ఇబ్బంది కలిగించడంతో పాటు నగర సౌందర్యాన్ని దెబ్బతీస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రదేశాలను పూర్తిగా పోస్టర్ల రహితంగా మార్చేందుకు ఫీల్డ్ సిబ్బంది నిత్యం తనిఖీలు చేస్తున్నారు.ప్రజలు కూడా ఈ చర్యలకు సహకరించి, అనుమతి లేకుండా పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయవద్దని లిసైబరాబాద్ మున్సిపల్ కమీషనర్ సృజన కోరారు.

## కళ్యాణ లక్ష్మి,షాదీముబారక్ పథకాలను యధావిధిగా కొనసాగించాలి

### మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



**చండూరు, క్రైమ్ మిర్రర్:** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం చండూరు మున్సిపాలిటీలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపైరోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాలపై కోర్టు స్టే విధిస్తే ప్రభుత్వం తరపు న్యాయవాదులు ఏమి చేస్తున్నారని ఆయన నిలదీశారు. కెసిఆర్ ను తిట్టడం తప్ప రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదన్నారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టి పదేళ్లపాటు అమలు చేసిందన్నారు.అయితే ప్రస్తుత ప్రభుత్వం కోర్టుల్లో సరైన వాదనలు వినిపించకపోవడంతో పథకంపై ఆంక్షలు వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.పథకాన్ని యథావిధిగా కొనసాగించడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తులం బంగార. ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, రైతులకు ఎకరాకు రూ.15 వేల ఆర్థిక సాయం,రైతు బీమా వంటి హామీలను కూడా అమలు చేయాలన్నారు. రైతు బీమా ప్రీమియం చెల్లించకపోవడం తో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వాన్ని విమర్శించడానికే సమయం కేటాయించకుండా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు.తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన పోరాటాన్ని గుర్తించాలని అన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో రైతులకు సాగునీరు, ఎరువులు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాటలతో, ఎదురుదాడులతో ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి తప్పించుకోలేదని హెచ్చరించారు. ఇప్పటికైనా వాస్తవాలకు దగ్గరగా పాలన సాగిస్తూ ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చండూరు, మర్రిగూడ, నాంపల్లి, మునుగోడు, గట్టుప్పల మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులుపాల్గొన్నారు

### కళ్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగించాలి : ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్




**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ఎత్తివేసేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకోవాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశానుసారం బిఆర్ఎస్ శ్రేణులు బాలాపూర్ మండల కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమ పథకాలను అడ్డుకునే దిశగా చేస్తున్న ప్రయత్నాలను తప్పుపడుతూ సంక్షేమ పథకాలను రద్దు చేస్తే బిఆర్ఎస్ పార్టీ తరఫున కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



### మామిడిగట్టు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా నర్సయ్య

**మందమర్రి ఆగస్టు 17 (క్రైమ్ మిర్రర్) :** మండలంలోని మామిడిగట్టు గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీ అధ్యక్షుడిగా వేల్పుల నర్సయ్య మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మండల ఇన్‌చార్జిలు తైదల జంపన్న, ఆసంపెల్లి శివకుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షుడిగా వేల్పుల బాపు, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల ప్రదీప్, కార్యదర్శిగా వేల్పుల అంకయ్య, కార్యనిర్వాహక సభ్యుడిగా గోల్కొండ సాగర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తైదల జంపన్న మాట్లాడుతూ మాదిగల ఆత్మగౌరవం, జాతి ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వేల్పుల రవి, సునీల్, మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతలవి మొసలి కన్నీళ్లు -- కళ్యాణ లక్ష్మిపై తప్పుడు ప్రచారాలు ఆపాలి

### కోర్టు స్టేకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ లోపభూయిష్ట ఉత్తర్వులే కారణం

### కూకట్ పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు క్రాంతి ముదిరాజ్



**కూకట్ పల్లి, ఆగష్టు 17 (క్రైమ్ మిర్రర్) :** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తోందంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు క్రాంతి ముదిరాజ్ విమర్శించారు. రాజకీయంగా ఉనికిని కాపాడుకునేందుకే బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కొనసాగింపుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని క్రాంతి ముదిరాజ్ స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సరైన చట్టబద్ధత లేకుండా, లోపభూయిష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం వల్లే ఈ పథకానికి సంబంధించి న్యాయస్థానంలో సమస్యలు తలెత్తాయని ఆయన పేర్కొన్నారు. దాని ఫలితంగానే ప్రస్తుతం కోర్టు తాత్కాలిక స్టే విధించిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని రద్దు చేయలేదని, కేవలం హైకోర్టు ఇచ్చిన తాత్కాలిక స్టే కారణంగానే ప్రస్తుతం నిధుల పంపిణీకి ఆటంకం ఏర్పడిందని వివరించారు. పథకం కొనసాగింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రీన్ ఛానల్ ద్వారా పథకానికి సంబంధించిన నిధులను విడుదల చేస్తూనే ఉందని క్రాంతి ముదిరాజ్ తెలిపారు. కోర్టు స్టేపై డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించి అప్పీల్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా పథకాన్ని కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

**బీఆర్ఎస్ నేతలు వాస్తవాలు తెలుసుకోవాలి.**

పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో పథకాలను సక్రమంగా నిర్వహించని బీఆర్ఎస్ నాయకులకు, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతిక హక్కు లేదని క్రాంతి ముదిరాజ్ అన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలను మానుకోవాలని ఆయన హితవు పలికారు.ఇప్పటికైనా రాజకీయ డ్రామాలు పక్కనపెట్టి వాస్తవాలను తెలుసుకోవాలని, పేద ప్రజలను తప్పుదోవ పట్టించే తప్పుడు ప్రచారాలను ఆపాలని ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ తరపున క్రాంతి ముదిరాజ్ డిమాండ్ చేశారు.

# నేర నియంత్రణకు మరింత సమర్థవంతమైన చర్యలు

## పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

## నాణ్యమైన ఆధారాలతో నిందితులకు శిక్షలు పడేలా చూడాలి

## నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలు






**నల్గొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** జిల్లాలో నేర నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నేరాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న నేరాల తీరుతో పాటు, కేసుల దర్యాప్తు పురోగతిని సమగ్రంగా సమీక్షించిన ఎస్పీ పవార్.. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, నిందితులకు శిక్ష పడేలా పక్కా ఆధారాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు.

**పెండింగ్ కేసులపై వేగం..**
**'ఈ-సాక్ష్య' వినియోగం తప్పనిసరి**

పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, కేసుల పరిష్కారంలో నాణ్యతతో పాటు నిర్ణీత కాలపరిమితిని తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ పవార్ అధికారులకు సూచించారు. దర్యాప్తు ప్రక్రియను మరింత శాస్త్రీయంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి దర్యాప్తు అధికారి 'ఈ–సాక్ష్య' యాప్‌ను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్‌లో ఎలాంటి సందేహాలకు తావులేకుండా, కేసులకు సంబంధించిన ఆధారాలను పద్ధతిగా భద్రపరచడంతో పాటు, కోర్టులో నిందితులకు శిక్షపడే విధంగా శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తును బలోపేతం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లలో రికార్డుల నిర్వహణ, కేసుల వివరాల నమోదు, దర్యాప్తు పురోగతి, సీసీటీఎన్ఎస్, ఈ–సాక్ష్య వంటి సాంకేతిక వ్యవస్థల వినియోగంపై అధికారులకు పలు సూచనలు చేశారు. కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు.

**నేరం జరిగేలోపే అడ్డుకట్ట.. సీసీ కెమెరాలపై నిఘా**

నేరాల నియంత్రణతో పాటు ముందస్తు నేర నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ ఆదేశించారు. పాత నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై తక్షణమే స్పందించాలని సూచించారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే నేరం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే పోలీసుల ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. బీట్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి, సమస్యాత్మక ప్రాంతాలు, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలను, ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, నేరస్తుల కదలికలను గుర్తించడం, నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నందున పట్టణాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలు, ముఖ్యమైన రహదారుల వద్ద కెమెరాల ఏర్పాటును మరింత విస్తరించాలని సూచించారు. ప్రజలు, వ్యాపార సంస్థలు, స్థానిక సంస్థల సహకారంతో మరిన్ని ప్రాంతాల్లో, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాలు నిరంతరం పనిచేసేలా వాటి పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించి, సాంకేతిక లోపాలు ఉంటే వెంటనే సరిచేయించాలని ఆదేశించారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తత.. డ్రగ్స్, అక్రమ రవాణాపై ఉక్కుపాదం**

పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. సైబర్ మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి, బాధితుల డబ్బు ఇతర ఖాతాలకు మరింతగా బదిలీ కాకుండా సత్వర చర్యలు చేపట్టి, వీలైనంత త్వరగా నష్టాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. మాదక ద్రవ్యాల సరఫరా గొలుసును గుర్తించి, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ రవాణా, ఇసుక అక్రమ మైనింగ్, పీడీఎస్ బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల అక్రమ తరలింపులు జరగకుండా, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ పవార్ ఆదేశించారు. సరిహద్దుల మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను నిరంతరం తనిఖీ చేస్తూ, అనుమానాస్పద వాహనాలు, వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సమస్యలను సానుకూలంగా విని, చట్టపరమైన పరిధిలో సత్వర పరిష్కారం చూపాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. బాధితుల ఫిర్యాదులపై ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా స్పందించి, ప్రజలకు న్యాయం అందించే విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేర నియంత్రణ, నేరాల ఛేదన, కేసుల దర్యాప్తు, కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెంపు వంటి అంశాలపై అధికారులు నిరంతరం దృష్టి సారించాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, శాస్త్రీయ దర్యాప్తు విధానాలను అవలంబించి, ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించేలా, ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీలు మల్లారెడ్డి, శ్రీనివాస్‌రావు, రవికుమార్, లక్ష్మీనారాయణ, సీఐలు, ఎస్ఐలు, సంబంధిత పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఫ్లెక్స్ బోర్డు తొలగిస్తుండగా విద్యుత్ షాక్.. యువకుడు మృతి

## బాలానగర్‌లో విషాద ఘటన.. ప్రమాదవశాత్తు

## మృతి చెందినట్లు పోలీసుల వెల్లడి



**బాలానగర్, ఆగస్టు 17 (క్రైమ్ మిర్రర్) :** బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. షాపు వద్ద పడిపోయిన ఫ్లెక్స్ బోర్డును తొలగించే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై 26 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజు చౌదరి (26) సోమవారం ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో బాలానగర్‌లోని గురుకృప గ్లాస్, ప్లైవుడ్ అండ్ హార్డ్‌వేర్ దుకాణం వద్ద ఉన్నాడు. అక్కడ పడిపోయిన ఫ్లెక్స్ బోర్డును తొలగించే ప్రయత్నం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే అతని పెదనాన్న దయారాం చౌదరి సంజు చౌదరిను స్థానిక బాలానగర్‌లోని బీబీఆర్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్యుడు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, మృతుడి తండ్రి, ఫిర్యాదుదారు దయరాం చౌదరి, తన కుమారుడి మృతి ప్రమాదవశాత్తు జరిగిందని, ఈ ఘటనపై తమకు ఎలాంటి అనుమానం లేదని పోలీసులకు తెలిపారు. ఈ ఘటనపై బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. యువకుడి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

# కెపీహెచ్ బి లో గంజాయి మత్తులో దారిన వెళ్లే వ్యక్తులపై దాడులు

## అల్లరిమూకలను అరికట్టడంలో పోలీసులు విఫలం... మాధవరం కాంతారావు



**కూకట్ పల్లి, ఆగస్టు 17 (క్రైమ్ మిర్రర్) :** కెపిహెచ్ బి కాలనీ ధనలక్ష్మీ సెంటర్ వద్ద గత రెండు రోజుల క్రితం అల్లరి మూకల బారిన పడి గాయాలపాలైన బాధితులను కూకట్ పల్లి నియోజకవర్గ బిజెపి ఇన్ ఛార్జ్, నిజామాబాద్ జిల్లా బిజెపి ఇన్ ఛార్జ్ మాధవరం కాంతారావు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెపిహెచ్ బి కాలనీలో అల్లరి మూకల దాడులు ఎక్కువ అవుతున్నాయని, మద్యం గంజాయి మత్తులో యువకులు అర్ధరాత్రి దాటితే దారిన పోయే వ్యక్తులపై దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కెపిహెచ్ బి కాలనీలో గంజాయి విచ్చల విడిగా అమ్ముడవుతున్న పట్టించుకునే అధికారులే కనిపించడం లేదని ఆరోపించారు. కెపిహెచ్ బి కాలనీ ధనలక్ష్మీ సెంటర్ వద్ద ఇద్దరు యువకులపై దాడులకు పాల్పడిన యువకులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి తోట రమేష్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అర్బన్ ఐటి సెల్ కన్వీనర్ నర్వ పవన్ కుమార్, కూకట్ పల్లి నియోజకవర్గం ఓబీసీ మోర్చా కన్వీనర్ వినోద్ గౌడ్, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేపీహెచ్‌బీలో వృద్ధుడు అదృశ్యం.. కుటుంబంలో ఆందోళన

## ఇంట్లో లేఖ, సెల్‌ఫోన్ వదిలి వెళ్లిన 72 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగి




**కూకట్‌పల్లి, ఆగస్టు 17 (క్రైమ్ మిర్రర్) :** కేపీహెచ్‌బీ కాలనీలో 72 ఏళ్ల వృద్ధుడు అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళనకు గురిచేసింది. కుటుంబ సభ్యుల మధ్య స్వల్ప విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నంకు చెందిన తేజమూర్తుల ఆనందరావు (72) తన కుమారుడు హర్షవర్ధన్ కుటుంబంతో కలిసి గత ఏడాది కాలంగా కేపీహెచ్‌బీ కాలనీలోని వెర్టెక్స్ సద్గురు కృప అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్నారు. ఆనందరావు రిటైర్డ్ ఉద్యోగి. ఈ మేరకు ఆగస్టు 16న సాయంత్రం 5:10 గంటల సమయంలో హర్షవర్ధన్ పని నిమిత్తం బయటకు వెళ్లారు. తిరిగి రాత్రి 7:30 గంటలకు ఇంటికి చేరుకున్న సమయంలో తండ్రి ఆనందరావు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఇంట్లో పరిశీలించగా ఆనందరావు తన మొబైల్ ఫోన్‌తో పాటు ఓ లేఖను వదిలి వెళ్లినట్లు గుర్తించారు. ఆ లేఖలో తాను ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని, తన కోసం వెతకవద్దని, పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని, తిరిగి ఇంటికి రానని పేర్కొన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆనందరావు ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు హర్షవర్ధన్ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# శిక్షణ సంస్థల సమీపంలో బహిరంగంగా సిగరెట్ల విక్రయాలు!

## ప్రశ్నిస్తే దురుసు సమాధానాలు

## నిబంధనలు గాలికి! అధికారుల చర్యల కోసం స్థానికుల డిమాండ్




**కూకట్ పల్లి, ఆగస్టు 17 (క్రైమ్ మిర్రర్) :** నగరంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు వ్యాపారులు వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా ఓ శిక్షణ సంస్థ సమీపంలో బహిరంగంగా సిగరెట్లు విక్రయిస్తున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. శిక్షణ కేంద్రం వద్దే సిగరెట్ల విక్రయాలు విద్యా, శిక్షణ సంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై నిబంధనలు ఉన్నప్పటికీ, సంబంధిత దుకాణంలో బహిరంగంగా సిగరెట్లు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా అక్కడే కొందరు సిగరెట్లు కాలుస్తుండటంతో అటుగా వెళ్లే విద్యార్థులు, మహిళలు, ఇతర పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారని వారు వాపోతున్నారు.

**ప్రశ్నిస్తే దురుసు ప్రవర్తన**

సిగరెట్ల విక్రయాలపై కొందరు బాధ్యతాయుతమైన పౌరులు దుకాణ నిర్వాహకుడిని ప్రశ్నించగా, ఆయన సమాధానం చెప్పాల్సింది పోయి దురుసుగా ప్రవర్తించినట్లు స్థానికులు చెబుతున్నారు. "మా ఇష్టం.. ఎక్కడైనా అమ్ముకుంటాం" అన్నట్టుగా సమాధానం ఇవ్వడంతో పాటు, ప్రశ్నించిన వారితో వాగ్వాదానికి దిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**అధికారుల పర్యవేక్షణ ఏది?**

శిక్షణ సంస్థల సమీపంలోనే ఇలాంటి విక్రయాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రభుత్వం ఒకవైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ విక్రయాలు జరగడం ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఘటనపై విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులు, మహిళలు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా ఆయా ప్రాంతాల్లో పొగాకు విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేయొద్దు

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మూసాపేటలో బీఆర్ఎస్ ఆందోళన

## తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ.. గాంధీ విగ్రహానికి లేఖ అందజేత

**కూకట్ పల్లి, ఆగస్టు 17 (క్రైమ్ మిర్రర్) :** పేద ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మూసాపేటలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన చేపట్టారు. మూసాపేట లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వా నికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలపై పునరాలోచించాలని కోరుతూ గాంధీ విగ్రహానికి లేఖను అందజేశారు.

**పేద కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి అండ: తూము శ్రావణ్ కుమార్**

ఈ సందర్భంగా తూము శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ"ఆడపిల్ల పెళ్లి తల్లిదండ్రులకు భారం కాకూడదనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారు. ఈ పథకాలు లక్షలాది నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాయి" అని అన్నారు. ముఖ్యంగా పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగకరంగా మారిందని పేర్కొన్నారు. ప్రజాదరణ పొందిన సంక్షేమ పథకాలను రాజకీయ కక్షతో పక్కన పెట్టడం లేదా రద్దు చేయాలని చూడటం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం గతంలో అమలులో ఉన్న ప్రజా సంక్షేమ పథకాలను రద్దు చేయాలని ప్రయత్నించడం ప్రజావ్యతిరేక చర్య అని శ్రావణ్ కుమార్ విమర్శించారు. పేదల సంక్షేమానికి విఘాతం కలిగించే నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బాబు రావు, మల్లేష్, గరిగె తుకారాం, తూము మనోజ్, పవన్ రెడ్డి, రవీందర్, ఈశ్వర్, జైరాజ్, అరుణ్, గరిగె కృష్ణ, అర్జున్, వీరాచారి, జిల్లా అక్షయ్, కర్క నిఖిల్, అశోక్, ప్రదీప్ యాదవ్, సిద్దార్థ్, గిరీష్ తదితరులతో పాటు మహిళా నాయకులు శ్యామల, హరిత, పద్మ, శాంత, రమాదేవి, అనురాధ, ఉమా, సంధ్య, శిరీష, శివలీల తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు



# ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన

## బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ పవార్ ఆదేశం

## గ్రీవెన్స్ డేలో 36 మంది బాధితుల సమస్యలు విన్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్గొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖపై నమ్మకంతో వస్తున్నందున, వారి ఫిర్యాదులపై సత్వరంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా, చర్యలు తీసుకోవాలని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో, జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధి నుంచి వచ్చిన దాదాపు 36 మంది బాధితుల సమస్యలు, ఫిర్యాదులను ఎస్పీ సవివరంగా విని, ఆయా సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**భూ వివాదాలు.. కుటుంబ సమస్యలు.. ఆర్థిక లావాదేవీలపై ఫిర్యాదులు**

గ్రీవెన్స్ డేకు వచ్చిన బాధితులు ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలు తదితర అంశాలపై, తమ ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ శ్రద్ధగా పరిశీలించి, సమస్యకు సంబంధించిన వివరాలను బాధితుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం ఆయా ఫిర్యాదులకు సంబంధించిన పోలీస్ అధికారులు,



సిబ్బందితో ఎస్పీ మాట్లాడి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల స్వభావాన్ని బట్టి సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, వాస్తవాలను నిర్ధారించిన తర్వాత చట్టపరమైన నిబంధనల ప్రకారం సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితుల ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలు, కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చిన అనంతరం చట్టానికి లోబడి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ శాఖ దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉన్నందున, వారి ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించాలని ఎస్పీ సూచించారు. ప్రతి అంశంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం అందేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు.

**ప్రజలకు అందుబాటులో ఉండటమే పోలీస్ శాఖ బాధ్యత**

ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం, పోలీస్ శాఖ ప్రధాన బాధ్యతని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. గ్రీవెన్స్ డే కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీని కలిసి, తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి, చట్ట పరిధిలో సత్వర పరిష్కారం అందించేందుకు, చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. బాధితుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.



## మర్రిగూడలో ప్రజావాణి.. ఏడు దరఖాస్తుల స్వీకరణ

**మర్రిగూడ (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, ప్రతి మండలంలో ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా, సోమవారం మర్రిగూడ మండల అభివృద్ధి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మునయ్య, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. పలు సమస్యలపై ప్రజల నుంచి మొత్తం ఏడు దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 2, విద్యాశాఖకు 1, పంచాయతీరాజ్ శాఖకు 3, హౌసింగ్ శాఖకు 1 దరఖాస్తు వచ్చినట్లు వెల్లడించారు. ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలను పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలోనే ప్రజల సమస్యలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా, సమస్యల పరిష్కారం కానున్నాయి. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా, అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి, వాటిపై అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

## పేదల సంక్షేమంతో చెలగాటం ఆడితే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరు : రామిడి రామిరెడ్డి



**బాలాపూర్(క్రైమ్ మిర్రర్):** పేదల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బాలాపూర్ మండల కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు రామిడి రామిరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో పేదింటి ఆడబిడ్డల పెళ్లికి అండగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఆ హామీని నెరవేర్చకపోగా ఇప్పుడు పేదల కోసం అమలవుతున్న పథకాన్ని కూడా ఆపే పరిస్థితి తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. ఈ పథకానికి సంబంధించి హైకోర్టులో కేసు విచారణ జరుగుతున్నప్పటికీ, ప్రభుత్వం సరైన సమయంలో కౌంటర్ దాఖలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నించేలా ఉందన్నారు. కోర్టులో బలమైన వాదనలు వినిపించి పథకాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను తీసుకొచ్చిందని, అందులో కల్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకం ఎంతో ప్రతిష్టాత్మకమైనదని, పేద ఆడబిడ్డల పెళ్లికి అండగా నిలిచే ఈ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పేదల పక్షాన బీఆర్ఎస్ పార్టీ మరింత ఉధృతంగా ఉద్యమిస్తుందని, పేదల సంక్షేమంతో చెలగాటం ఆడితే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని రామిడి రామిరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాలలో ప్రజావాణికి 14 దరఖాస్తులు




**చిట్యాల క్రైమ్ మిర్రర్:** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి--దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం సోమవారం చిట్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎంపీడీవో జెల్లా పాండు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్వో విజయ్ కుమార్, సూపరింటెండెంట్ మనోహర్, ఎంపీఓ కోటేష్‌తో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 14 దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

## సంగారెడ్డి ఆసుపత్రిలో నిండు గర్భిణి మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

- బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి
- కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి
- మంత్రి స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించాలి
- ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ డిమాండ్



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 17:** సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిండు గర్భిణి బైరి అనిత మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన ఆస్పత్రి సిబ్బంది, డ్యూటీ డాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ డిమాండ్ చేశారు. ఆందోల్ నియోజకవర్గం చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామానికి చెందిన మృతురాలు బైరి అనిత కుటుంబాన్ని సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించారు. ఆందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూర్ర సంతోష్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బుచ్చేంద్ర మాదిగ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనిత ఆగస్టు 10న సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిందని, ఆగస్టు 12న మృతి చెందిందని తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మృతి జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని, ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఆందోల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా కొనసాగుతున్న దామోదర్ రాజనర్సింహ ఈ ఘటనపై స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గందగళ్ల వీరయ్య మాదిగ, కొండాపూర్ మండల ఇన్‌చార్జి కందుకూరి వినయ్, మునిపల్లి మండల కోఆర్డినేటర్ జంగం నవీన్, రాజు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## మునుగోడు గ్రామసభలో హంగామా...వ్యక్తిగత ఆరోపణలతో ముగిసిన సభ

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ పాలకూరి రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభ నిర్వహించారు.కొంత సేపటికి తీవ్ర కలకలానికి దారితీసింది. గ్రామంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన ఈ వేదిక, కొందరి స్వార్థం మరియు వ్యక్తిగత విమర్శలకు కేంద్రంగా మారింది. గ్రామ సమస్యల పరిష్కారం కోసం సమావేశమైన ఈ సభలో కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తమ వ్యక్తిగత పంచాయతీలు, ఆరోపణలను ముందుకు తీసుకురావడంతో రసాభాస సృష్టించారు. సభను సజావుగా సాగనివ్వాలని, ఊరి సమస్యలపై చర్చించాలంటూ పలువురు ప్రజలు వేడుకున్నప్పటికీ,కొంత మంది ఏమాత్రం పట్టించుకోలేదు. గ్రామ సభను కావాలనే తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ శాఖల అధికారులు గందరగోళ పరిస్థితి నెలకొనడంతో వేరే దారి లేక సభ నుంచి వెనుతిరిగారు. అధికారులతో పాటు వచ్చిన ప్రజలు కూడా తీవ్ర నిరాశతో వెళ్ళిపోవాల్సి వచ్చింది.ప్రతిసారి గ్రామసభ జరిగినప్పుడు ఉద్దేశపూర్వకంగా అభివృద్ధి నిరోధకులుగా మారి, ఊరి ప్రయోజనాలను పక్కనపెట్టి వ్యక్తిగత గొడవలను వేదికగా చేసుకుంటున్నారని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుని, తదుపరి గ్రామ సభ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని మునుగోడు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రెండేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

### అమీన్‌పూర్‌లో ఘటన.. నిందితుడిని పట్టుకున్న స్థానికులు

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 17: అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 48 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం స్థానికంగా ఓ ఇటుకల కంపెనీకి చెందిన గదుల్లో నివసిస్తున్నాడు. గండిగూడెం చౌరస్తా సమీపంలో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని నిందితుడు తీసుకెళ్లి, ఇలాపూర్ తండా శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన సమయంలో బాలిక ఏడుపు విన్న స్థానికుడు శశికుమార్ అక్కడికి చేరుకున్నాడు. నిందితుడు చిన్నారితో ఉన్న పరిస్థితిని గమనించిన శశికుమార్ వెంటనే బాలికను రక్షించి, తన స్నేహితుడు నవీన్‌కు సమాచారం అందించాడు. అనంతరం ఇద్దరూ కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.ఘటనపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

## శ్రావణమాసం నాగుల పంచమి వేడుకలు: పుట్టలో పాలు పోసిన మాజీ కౌన్సిలర్ ఉషారాణి



**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** శ్రావణమాసం నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ కౌన్సిలర్ ఉషారాణి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల పంచమి సందర్భంగా స్థానిక ఆలయ ప్రాంగణంలోని నాగుల పుట్ట వద్ద ఆమె మహిళలతో కలిసి పాలు పోసి, నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ.. శ్రావణమాసంలో వచ్చే నాగుల పంచమి అత్యంత విశిష్టమైనదని, నాగదేవత ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. భారతీయ సాంప్రదాయంలో ప్రకృతిని, జీవజాలాన్ని పూజించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో పలువురు మహిళలు, ప్రజాప్రతినిధులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# కార్మికుల సమస్యల పరిష్కారం కలెక్టరేట్ ముందు బిఎంఎస్ ధర్నా

**కనీస వేతనం రూ.30 వేలకు పెంచాలి..**

**ఈఎస్ఐ వేతన పరిమితి రూ.42 వేలకు పెంచాలి**

**కార్మికుల శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాల్సిందే**

**కనీస వేతనం పెంచితేనే కార్మిక కుటుంబాలకు భరోసా**

**సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి**

**కార్మిక సంక్షేమ నిధులు కార్మికుల కోసమే ఖర్చు చేయాలి**






పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, ఆగస్టు 17: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై ధర్నాలు నిర్వహిస్తున్నామని, తమ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టర్ ద్వారా వినతిపత్రం సమర్పిస్తున్నామని తెలిపారు. కార్మికుల కనీస వేతనాన్ని రూ.14 వేల నుంచి రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ వేతన పరిమితిని రూ.21 వేల నుంచి రూ.42 వేలకు పెంచాలని, గ్రాట్యుటీ సీలింగ్‌ను రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచాలని కోరారు. గ్రాట్యుటీ పనిదినాల లెక్కింపును 15 రోజుల నుంచి 30 రోజులకు పెంచాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 'స్కిల్ డెవలప్‌మెంట్' పేరుతో విద్యార్థులను తీసుకొచ్చి పరిశ్రమల్లో పనిచేయిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. భవన నిర్మాణ, రవాణా, ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. కార్మిక సంక్షేమ బోర్డుల్లోని నిధులను ఇతర సంక్షేమ పథకాలకు బదిలీ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆయా బోర్డులను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ప్రమాద బీమా ద్వారా ఆదుకోవాలని, ప్రసూతి, వివాహ సహాయాన్ని రూ.30 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని కోరారు. కార్మికులకు ఎలాంటి జాప్యం లేకుండా హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డుల కోసం కార్మికుడికి రూ.3,500 చెల్లిస్తున్నప్పటికీ కొందరు కాంట్రాక్టర్లు ఆ మొత్తాన్ని తీసుకుంటూ కార్డులు అందించడం లేదని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు సక్రమంగా అమలు కావడం లేదని నర్సింహారెడ్డి అన్నారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కార్మికులకే కనీస వేతనాలు అమలు కాకపోతే ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే కార్మికుల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. కార్మికుల కొనుగోలు శక్తి పెరిగితేనే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని అన్నారు.ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో పాటు కార్మికుల కనీస వేతనాలను పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు. బస్సుల సంఖ్యను కూడా పెంచాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలపై స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పరిశ్రమలకు చెందిన కార్మికులు, యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రెండేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

**అమీన్‌పూర్‌లో ఘటన.. నిందితుడిని పట్టుకున్న స్థానికులు**



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 17: అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 48 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం స్థానికంగా ఓ ఇటుకల కంపెనీకి చెందిన గదుల్లో నివసిస్తున్నాడు. గండిగూడెం చౌరస్తా సమీపంలో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని నిందితుడు తీసుకెళ్లి, ఇలాపూర్ తండా శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన సమయంలో బాలిక ఏడుపు విన్న స్థానికుడు శశికుమార్ అక్కడికి చేరుకున్నాడు. నిందితుడు చిన్నారితో ఉన్న పరిస్థితిని గమనించిన శశికుమార్ వెంటనే బాలికను రక్షించి, తన స్నేహితుడు నవీన్‌కు సమాచారం అందించాడు. అనంతరం ఇద్దరూ కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.ఘటనపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

## మునుగోడు ప్రజల్లోకి చొచ్చుకుపోతున్న ఈఎల్వివి భాస్కర్

**ఇంతకీ ఈయన లక్ష్యం ఏంటి...?**



చండూరు, క్రైమ్ మిర్రర్: ఇప్పుడు మునుగోడు నియోజకవర్గం లో ఈఎల్వి భాస్కర్ (ఇరుగు దిండ్ల) భాస్కర్ పేరు ప్రముఖంగా వినబడుతుంది. ఓ వైపు యువతను ప్రోత్సహిస్తూనే మరోవైపు సేవా కార్యక్రమాలతో దూసుకుపోతున్నాడు. ఇంతకు ఈయన లక్ష్యం ఏంటి అనేది నియోజవర్గ వ్యాప్తంగా సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పలువురు నాయకులు ఇలా ఫౌండేషన్ ల పేరుతో ముందుకు వచ్చి ఆ తర్వాత రాజకీయ నాయకుల అవతారం ఎత్తారు. ఈయన అదే కోవకు చెందినవారు అని చర్చ నడుస్తుంది. ఏదేమైనా సేవా కార్యక్రమాలతో తగిన గుర్తింపు పొందుతున్నారు. ఇక ఇప్పుడున్న పరిస్థితుల్లో రాజకీయాలు చాలా ఖరీదు అయ్యాయి. ఎమ్మెల్యేగా బరిలో ఉండాలంటే కోట్ల వ్యవహారంగా మారింది. ఆర్థికంగా చూసుకుంటే ఈఎల్వి భాస్కర్ అన్ని విధాల తూకే విధంగా ఉన్నారు. ముఖ్యంగా ఈయన బిఆర్ఎస్ పార్టీ నుంచి బరిలో ఉంటారనే ప్రచారం అయితే జోరుగా సాగుతోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి వ్యక్తులను ఢీకొనాలంటే ఆర్థికంగా డబ్బులకు వెనకాడని వ్యక్తులు కావాల్సి ఉంది. ఈ క్రమంలో నెక్స్ట్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాండెట్ ఈ ఎల్ వి భాస్కర్ ఏ అంటూ ప్రచారం జరుగుతోంది. ఇందుకు ఊతం ఇస్తూ ఈఎల్వి భాస్కర్ చేస్తున్న కార్యక్రమాలు కూడా అలాగే ఉన్నాయి. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ ముందుకు వెళ్తున్నారు. కమ్యూనిటీ భవనాలు, పేదలకు అనేక సహాయ కార్యక్రమాలు చేస్తూ తనదైన ముద్ర వేస్తూ వస్తున్నారు. ముఖ్యంగా యువత ఈయనకు అభిమానులుగా మారుతుండడం కూడా రాజకీయ పరిణామాల్లో ఓ పెను మార్పుగా చెప్పుకోవచ్చు. ఏదేమైనా భాస్కర్ మునుగోడు నియోజకవర్గ రాజకీయాల్లో సంచాలనంగా మారనున్నాడు అనేది మాత్రం నిజం. ఈయన ఎవరికి పోటీ అవుతారు ఎవరికి చెక్కు పెడతాడు అనేది మాత్రం సస్పెన్షన్ గా మారింది. ఈ ఎపిసోడ్ కి సంబంధించి మరింత సమాచారాన్ని మరిన్ని వార్తల్లో మరింత వివరంగా మీ ముందుకు క్రైమ్ మిర్రర్ తీసుకురానుంది.

## గండిపేట్ ఎమ్మార్వో కార్యాలయం ముందు బీఆర్ఎస్ ధర్నా




గండిపేట(క్రైమ్ మిర్రర్): కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గండిపేట్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ నార్సింగి సర్కిల్ అధ్యక్షుడు కే. విష్ణువర్ధన్ రెడ్డి, బండ్లగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజ్ ఆధ్వర్యంలో గండిపేట్ చౌరస్తా నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అర్హులైన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ప్రయోజనాలను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు గండిపేట్ ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షుడు ముక్తార్, మాజీ సర్పంచ్ ఉప్పల్ ముత్యాలు, సీనియర్ నాయకులు రవి యాదవ్, వెంకటేష్, రాములు, శాంతి నాయక్, శ్రీనివాస్, జైసింహ, మహిళా అధ్యక్షురాలు నిసా బేగం, మల్లేష్, వార్డు మెంబర్ గణేష్ ముదిరాజ్, గణేష్ రెడ్డి, పెద్దపులి కిషన్, శ్రీకాంత్ రెడ్డి, వాసు, ఫరీదా బేగం, సీమా బేగం, క్షేమమా బేగం, సల్మా బేగం, రజనీకాంత్, అరుణ, రేణుక, కవిత తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా నాగుల పంచమి

**కోదండ రామాలయం, గణేష్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు**

రామకృష్ణాపూర్ ఆగస్టు 17 (క్రైమ్ మిర్రర్): నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో మహిళలు సోమవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయం, గణేష్ టెంపుల్ ప్రాంగణాల్లోని పాముల పుట్టల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో చేరారు. పుట్టలకు పాలు పోసి, గుడ్లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.నాగుల పంచమి రోజున పాముల పుట్టలకు పాలు పోసి పూజలు చేయడం వల్ల శుభం కలుగుతుందని మహిళల విశ్వాసం. దీంతో ఆలయాల్లో ఉదయం నుంచే మహిళలు బారులు తీరి పూజలు నిర్వహించారు. పుట్టల వద్ద పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా మారాయి.



## అధికారులు ఫుల్..! ప్రజలు నిల్..!!

**హత్నూరలో ప్రజావాణికి స్పందన కరువు**

హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 17: మండల కేంద్రమైన హత్నూర మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి స్పందన అంతంత మాత్రంగానే కనిపించింది. ప్రజల సమస్యలను స్వీకరించేందుకు తహశీల్దార్ ఫర్వీన్ షేక్, ఎంపిడిఓ శంకర్, ఎంపిఓ యూసుఫ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు కౌంటర్లు ఏర్పాటు చేసి అందుబాటులో ఉన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించి ముగ్గురు వ్యక్తులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు సమర్పించారు. పంచాయతీ విస్తరణ అధికారికి ఒకరు స్థానిక సమస్యపై ఫిర్యాదు చేశారు. మొత్తం నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.మండలంలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం చాలామందికి తెలియకపోవడంతోనే స్పందన తక్కువగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజలకు ప్రజావాణి కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో ప్రజావాణి ద్వారా అధికారులు, సామాన్య ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

## పెళ్లి చేసుకోమన్నందుకు దారుణ హత్య

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్): బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహం చేసుకోవాలని ప్రశ్నించిన యువతని హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం షాహిన్ నగర్ బిస్మిల్లా కాలనీలో నివసించే షేక్ అహ్మద్, వయసు 21, కు బీహార్ కు చెందిన రేహానాతో వయస్సు 21, ఒక సంవత్సరం నుండి ప్రేమలో ఉన్నారని, ప్రియుడితో కలిసి ఉంటున్న వీరిద్దరి మధ్య పెళ్లి విషయంపై తలెత్తిన వివాదంలో షేక్ అహ్మద్ కత్తితో రేహనను పొడిచి హత్య చేయడం, హత్య అనంతరం నిందితుడు తల్లితో కలిసి మృతదేహాన్ని సంచిలో ఉంచి మాయం చేయాలనే ప్రయత్నంలో ఉన్నారన్న సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకోవడం జరిగిందని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

## గురుకులాల్లో ఖాళీల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు: కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్, ఆగస్టు 17 (క్రైమ్ మిర్రర్) : జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి 5 నుంచి 9వ తరగతుల్లో మిగిలిన ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 20న నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ ప్రస్తుతం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.జిల్లాలోని 5 బాలుర, 4 బాలికల గురుకుల పాఠశాలల్లో కేటగిరీల వారీగా ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నారు. విటీజీ సెట్/బీఎల్వీ సెట్--2026 ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని కలెక్టర్ స్పష్టం చేశారు.అర్హులైన విద్యార్థులు ఈ నెల 20న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు నస్పూర్ ఐడీఓసీలో స్వయంగా హాజరై దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుల పరిశీలన అనంతరం మధ్యాహ్నం 2 గంటల తర్వాత మెరిట్ జాబితాను రూపొందించనున్నారు.ఎంపిక ప్రక్రియలో అనాథ, పాక్షిక అనాథ విద్యార్థులకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వారికి సీట్లు కేటాయించిన అనంతరం మిగిలిన ఖాళీలను ప్రవేశ పరీక్ష ర్యాంకు ఆధారంగా మెరిట్ ప్రకారం భర్తీ చేస్తారు.అభ్యర్థులు విటీజీ/బీఎల్వీ సెట్ ర్యాంకు కార్డు, కులం, బోనఫైడ్ ధ్రువపత్రాలతో పాటు అనాథ/పాక్షిక అనాథ ధ్రువపత్రాల నకళ్లను (వర్తించే వారికి) సమర్పించాలి. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు.

## చిట్యాలలో సార్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

చిట్యాల క్రైమ్ మిర్రర్: భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సార్ ప్రక్రియలో భాగంగా చిట్యాల మండలానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేశారు.95-నకిరేకల్ (ఎస్సీ) నియోజకవర్గం పరిధిలోని చిట్యాల మండలంలో 55 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ముసాయిదా జాబితాలో మొత్తం 44,770 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 22,256, మహిళలు 22,513, ఇతరులు 01 ఉన్నారు.ముసాయిదా జాబితాలో తమ పేరు ఉందో లేదో ఓటర్లు పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. పేరు లేకపోతే ఫారం-6 ద్వారా కొత్తగా నమోదు చేసుకోవచ్చు. ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా తదితర సవరణలకు ఫారం-8, అభ్యంతరాలు లేదా తొలగింపులకు ఫారం-7 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను సంబంధిత బి యే ఓ, అలాగే ఆ ఈ ఆర్ ఓ, ఈ ఆర్ ఓ కార్యాలయాల్లో లేదా ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని అధికారులు వెల్లడించారు.



# మునుగోడులో ప్రారంభమైన ప్రజావాణి సహాయ కేంద్రం

మునుగోడు క్రైమ్ మిర్రర్, (ఆగస్టు 17): స్థానికంగా ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ప్రజావాణి సహాయ కేంద్రం సోమవారం మునుగోడుమండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి రెవెన్యూపరిధిలో 10, పంచాయతీరాజ్ పరిధిలో 2 మొత్తం 12మంది తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించినట్లు ఎంపీడీఓ తెలిపారు.గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధులు పరిశీలించి, సమస్యలను గుర్తించి పరిష్కార మార్గం చూపాలని కోరారు.తమ స్థాయిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, తమ పరిధిలో లేని సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నేలపట్ల నరేష్,ఎంఈఓ మల్లేష్,మండల పంచాయతీ అధికారి కేదార్నాద్ తో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

## చిన్న అనంతగిరి శివాలయంలో భక్తుల సందడి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో నాగుల పంచమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగుల చవితి, శ్రావణ సోమవారం ఒకేసారి రావడంతో ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేసి, సమీపంలోని పుట్టలకు పాలు పోసి నాగదేవతలను భక్తిశ్రద్ధలతో పూజించారు. శ్రావణ సోమవారం, నాగుల చవితి పర్వదినాలు ఒకేసారి రావడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయంలో సందడి నెలకొంది.

## ఖర్గే అవమానంపై సంగారెడ్డిలో కాంగ్రెస్ నిరసన

**బీజేపీ నేతల చర్యలను ఖండించిన కాంగ్రెస్ నాయకులు**



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 17: ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను మరుసటి రోజు గంగాజలంతో 'శుద్ధీకరణ' చేయడాన్ని నిరసిస్తూ సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గంగేరి శ్రీహరి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ దీపక్ రాథోర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, నేరెళ్ల శారద, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, దుద్దిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఐబీ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్యాంపు కార్యాలయం సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ఐక్యత, సమగ్రత, సౌహార్దాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏఐసీసీ అబ్జర్వర్ దీపక్ రాథోర్ మాట్లాడుతూ, చంద్రుడిపైకి ప్రయాణిస్తున్న ఆధునిక కాలంలోనూ బీజేపీ నేతలు దళితుల పట్ల వివక్ష చూపడం దురదృష్టకరమన్నారు. మల్లికార్జున ఖర్గే దళితుడు కావడం వల్లే వేదికను శుద్ధి చేశారని ఆరోపించారు. కులం, మతం పేరుతో సమాజాన్ని విభజించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ విద్యార్థులు, యువత, అన్ని వర్గాల ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపికపై కొనసాగుతున్న కసరత్తు**

'సంఘటన్ సృజన్' కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని దీపక్ రాథోర్ తెలిపారు. మరో 5 నుంచి 7 రోజుల పాటు జిల్లాలో పర్యటించి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.

# లక్డారం దళిత రైతుల భూముల్లో ఎస్టీపీ ప్లాంట్‌పై ఉద్రిక్తత

**కలెక్టర్ ఆదేశాలంటూ భూముల స్వాధీనం చేసుకునే యత్నం**

**ఎలాంటి కలెక్టర్ ఆదేశాలు చూపలేదని రైతుల ఆరోపణ**

**హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే చర్యలేంటని ప్రశ్న**

**పోలీసుల మోహరింపుపై రైతుల ఆగ్రహం అడ్డుకునే ప్రయత్నం**

**అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువ**

**రైతులతో చర్చించకుండా భూములు స్వాధీనం చేసుకోవడం సరికాదని ఆందోళన**







**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 17:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్డారం గ్రామంలో దళిత రైతుల భూములపై ప్రతిపాదిత సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. సర్వే నంబర్ 498లోని సుమారు 21 ఎకరాల 31 గుంటల భూములను స్వాధీనం చేసుకునేందుకు సోమవారం అధికారులు, పోలీసులు పెద్ద సంఖ్యలో రావడంపై రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

కలెక్టర్ ఆదేశాలంటూ..

కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని, స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని అధికారులు చెప్పినప్పటికీ, ఆ ఆదేశాలను చూపించాలని కోరగా చూపలేదని బాధిత రైతులు ఆరోపించారు. సుమారు 100 మంది పోలీసులు, అధికారులు నాలుగు డీసీఎంలు, కార్ల వంటి వాహనాల్లో వచ్చి పొలం చుట్టూ ఇనుప కడీలు ఏర్పాటు చేసి భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని ప్రశ్నించిన రైతులను అరెస్టు చేస్తామంటూ బెదిరించినట్లు స్థానికులు ఆరోపించారు.

**కోర్టు విచారణ ఉండగానే చర్యలేంటి..?**

ఈ భూముల విషయంలో జూన్ 20న హైకోర్టును ఆశ్రయించామని, ఆగస్టు 20న విచారణ ఉన్నట్లు బాధిత రైతులు తెలిపారు. కోర్టు విచారణకు ముందే భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం ఎందుకని వారు ప్రశ్నించారు. అయితే కోర్టు కేసు, ఆదేశాలపై అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.

**70 ఏళ్లుగా సాగులో ఉన్న భూములు**

తమ కుటుంబాలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను ఎస్టీపీ కోసం తీసుకోవడం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభ నిర్వహించి, ప్రజాభిప్రాయం తీసుకున్న తర్వాతే ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రామ పరిసరాల్లో క్రషర్లు, ఇసుక తయారీ కేంద్రాలు, మట్టి--ఇసుక రవాణాతో కాలుష్య సమస్యలు ఎదుర్కొంటున్నామని, మరో ప్రాజెక్టుతో పర్యావరణం, ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

**రైతుల గొంతు వినరా?**

ప్రజా ప్రయోజన ప్రాజెక్టుల పేరుతో పేద రైతుల జీవనాధారమైన భూములను బలవంతంగా తీసుకోవడం సరికాదని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ అన్నారు. రైతులతో చర్చించి న్యాయబద్ధమైన పరిష్కారం చూపాలని, భూములు కోల్పోతే తగిన పరిహారం లేదా ప్రత్యామ్నాయ భూమి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. "కలెక్టర్ ఆదేశాలున్నాయంటే చూపించడానికి అభ్యంతరం ఎందుకు? కోర్టు విచారణకు తేదీ ఖరారై ఉన్నప్పుడు రైతుల భూముల వద్దకు ఇంత భారీగా పోలీసు బలగాలతో రావాల్సిన అవసరం ఏమిటి? అభివృద్ధి పేరుతో రైతుల హక్కులను తొక్కిపెట్టడం కాదు.. ముందుగా రైతులతో చర్చించి, చట్టబద్ధమైన పరిష్కారం చూపాలి."

ఎస్టీపీ ప్రతిపాదనను పునఃపరిశీలించి రైతుల భూములు, జీవనాధారాన్ని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. తమ భూముల హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని, న్యాయం జరగకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలి

**తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి ఆర్ఐ శ్రీవానికి వినతి పత్రం అందజేశారు**

**హైకోర్టు తీర్పును సాకుగా చూపి పేదింటి ఆడబిడ్డలకు అన్యాయం చేయొద్దు, కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ ముఖ్య నాయకులతో కలిసి తహసిల్దార్ కార్యాలయం దగ్గర జరిగిన ధర్నాలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ భారీ ఎత్తున మహిళలు చేరుకొని డిమాండ్ చేస్తూ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని వెంకటేష్ ఆరోపించారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలను రద్దు చేసే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం ఎంతటి ఆర్థిక భారంగా మారుతుందో గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారు 2014 అక్టోబర్ 2న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు. ప్రారంభంలో రూ.51 వేలుగా ఉన్న ఆర్థిక సహాయాన్ని దశలవారీగా రూ.75,116కు, అనంతరం రూ.1,00,116కు పెంచి పేద కుటుంబాలకు అండగా నిలిచారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందించారని, కరోనా వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలో కూడా కళ్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగిస్తూ పేద కుటుంబాలకు భరోసా కల్పించారని పేర్కొన్నారు. అయితే ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సింది పోయి, దానినే రద్దు చేసే కుట్రకు పాల్పడుతోందని వెంకటేష్ గారు విమర్శించారు. ఎన్నికల హామీ ప్రకారం తులం బంగారం కోసం ఆడబిడ్డలు, వారి కుటుంబాలు ప్రశ్నిస్తుండటంతో ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పథకాన్నే ఎత్తివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి పరిస్థితి దారుణంగా మారిందని, అర్హత ఉన్న అనేక మంది లబ్ధిదారులు పెళ్లిళ్లు పూర్తయి చాలా కాలం గడిచినా తమకు రావాల్సిన ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో పిల్లలు పుట్టేంత కాలం గడిచినా కళ్యాణ లక్ష్మి సాయం అందని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టులో కళ్యాణ లక్ష్మి అంశంపై ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కూడా వెంకటేష్ గారు తీవ్రంగా ప్రశ్నించారు. నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని నిలదీశారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం తన వాదనను బలంగా వినిపించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులకు సంబంధించిన వివిధ కేసులు, అవినీతి ఆరోపణలు, ఇతర అంశాల్లో ప్రైవేటు న్యాయవాదులను భారీ మొత్తాలు చెల్లించి నియమించుకునే ప్రభుత్వం, పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి పథకాన్ని కాపాడేందుకు మాత్రం ఎందుకు సమర్థవంతంగా న్యాయపోరాటం చేయలేదని ప్రశ్నించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కేవలం ప్రభుత్వ పథకాలు మాత్రమే కాదని, తెలంగాణలోని పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవం, భవిష్యత్తు, కుటుంబాలకు ఆర్థిక భరోసాతో ముడిపడిన సంక్షేమ కార్యక్రమాలని వెంకటేష్ గారు పేర్కొన్నారు. హైదర్గూడా డివిజన్ అధ్యక్షులు నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ కక్ష సాధింపులను పక్కనపెట్టి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిస్థాయిలో కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, తులం బంగారం హామీని నిలబెట్టుకోవాలని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యాదయ్య, శీలం తిరుపతి రెడ్డి,నోముల రాము యాదవ్, మైలర్ దేవ్ పల్లి డివిజన్ యువజన అధ్యక్షులు అక్కెం రఘు యాదవ్, రాజేష్ యాదవ్, కార్మిక విభాగం అధ్యక్షులు ఉప్పల్ శ్రీనివాస్, జహీర్ ఖాన్, సరికొండ దుర్గేష్, అశోక్ కుమార్, చిరంజీవి, రవీందర్ యాదవ్, అరుణ రెడ్డి, ఏర్వ సరితా మహేష్ నేత, సుగుణమ్మ, ప్రసన్న, మంజుల, పద్మ, పుష్ప, భాగ్యమ్మ, పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ నాయకులు హిళా నాయకురాలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల డ్రాఫ్ట్ సిద్ధం



గండిపేట(క్రైమ్ మిర్రర్): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటర్ల లెక్కింపు, నమోదు ప్రక్రియ తర్వాత, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మొత్తం 521 పోలింగ్ స్టేషన్లలో 3,88,278 మంది ఓటర్లు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వారిలో 1,95,556 మంది పురుషులు, 1,92,706 మంది మహిళలు, 16 మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారన్నారు. పోలింగ్ స్టేషన్ వారీగా డ్రాఫ్ట్ రోల్ ను సోమవారం పబ్లిష్ చేయడం జరిగిందన్నారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పౌరులందరూ తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలన్నారు . ఏవైనా అభ్యంతరాలు, సవరణలు ఉన్నట్లయితే ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు సంబంధిత దరఖాస్తు ఫారమ్‌లను పూర్తి చేసి సమర్పించవచ్చాన్నారన్నారు. ఇతర వివరాలకోసం భారత ఎన్నికల సంఘం ఈ సీ ఐ సిటిజన్ సర్వీస్ పోర్టల్ ను సందర్శించాలన్నారు . తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారులకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం సీ ఈ ఓ తెలంగాణ పోర్టల్‌ను కూడా చూడవచ్చన్నారు. ఓటరు జాబితాలో పేరు లేకుంటే ఫామ్ 6 పూర్తి చేసి సంబంధిత ఏ ఈ ఆర్ ఓ లకు ఇవ్వాలి...ఓటరు డ్రాఫ్ట్ జాబితా విడుదలైన తరువాత ఎవరి పేరైనా ఓటరు జాబితాలో లేనట్లయితే వారు ఫామ్ - 6 ను తగిన ఆధారాలతో పూర్తి చేసి అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కు అందజేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రం మార్పు, పేర్లలో ఏమైనా తప్పులు దొర్లినా ఫామ్ 8 పూర్తి చేసి ఇవ్వాలని కోరారు

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.